


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 18-12-2018 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 42 సంచిక : 84 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# బలహీనపడిన పెథాయ్

- తుపానుపై రెడ్అలర్ట్
- స్తంభించిన రవాణా వ్యవస్థ
- అనకాపల్లి - తుని మధ్య రాకపోకలపై ఆంక్షలు
- పలుచోట్ల కూలిన చెట్లు .. రద్దైన రైళ్లు
- కృష్ణాలో భారీగా పంట నష్టం
- కోనసీమ వ్యాప్తంగా కుండపోత
- 51 మంది ప్రత్యేక అధికారుల నియామకం
- అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు
- ఒడిశా వైపు పయనం!
- పెథాయ్ తుపానుపై చంద్రబాబు టెలికాన్ఫరెన్స్



అమరావతి: కోస్తాంధ్రను వణికించిన పెథాయ్ ప్రస్తుతం కాకినాడ - యానాం మధ్య తీరం దాటింది. ఇది క్రమంగా బలహీనపడుతోంది. ప్రస్తుతం ఒడిశావైపు పయనిస్తోంది. తూర్పు గోదావరి జిల్లా కాట్రేనికోన వద్ద మధ్యాహ్నం 12.30గంటలకు తీరాన్ని తాకింది. రెండున్నర లేదా మూడు గంటల్లో తీరం దాటుతుందని అధికారులు అంచనా వేసినట్టుగానే మధ్యాహ్నం సమయంలో తీరం దాటినట్టు ఆర్టీజీఎస్ నుంచి సమాచారం అందింది. ఇది మరింత బలహీనపడి వాయుగుండంగా మారి ఒడిశా వైపు పయనిస్తున్నట్టు గమనించారు. దీంతో తూర్పుగోదావరి జిల్లాకు పెథాయ్ తుపాను ముప్పు తప్పింది. గాలుల తీవ్రత తగ్గుముఖం పట్టింది. కొన్ని చోట్ల వర్షాలు తెరిపినివ్వడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. మంత్రులు నారా లోకేశ్, కళా వెంకట్రావు, కిడారి శ్రవణ్ ఆర్టీజీఎస్ కేంద్రం నుంచే ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. తుపాను గమనాన్ని పరిశీలిస్తే అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. చెట్లు కూలడం, విద్యుత్ స్తంభాలు కూలడం తదితర అంశాలను పరిష్కరించే దిశగా చర్యలు ప్రారంభించారు. తుపాను తీవ్రత తగ్గడంతో పలు చోట్ల గాలుల తీవ్రత తగ్గింది. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల తరువాయి 2లో..



## పెథాయ్ తుపానుపై చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

పెథాయ్ తుపానును అత్యవసర పరిస్థితిగా భావించాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తుపాను ప్రభావిత జిల్లాల్లో రెడ్అలర్ట్ ప్రకటించి దానికి తగ్గట్లుగా పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. విపత్తును ఎదుర్కోవడంపై ప్రతిశాఖ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుని అందుకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. పెథాయ్ తుపాన్‌పై చంద్రబాబు అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, నోడల్ తరువాయి 2లో..

### సంస్థాగత నిర్మాణం కోసం

# కృషి చేస్తా

## పార్టీని అజేయ శక్తిగా మలుస్తా

### ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు

### టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్ : మీ అందరి మద్దతుతో సీఎం కేసీఆర్ నాపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తాను. పార్టీని అజేయ శక్తిగా మలిచే క్రమంలో మీ ఆశీర్వాదం కోరుకుంటున్నాను, భగవంతుడు నాకిచ్చిన శక్తిని మీకోసం వినియోగిస్తాను అని టీఆర్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం కేటీఆర్ మాట్లాడారు. మొన్ననే జరిగిన ఎన్నికల్లో అఖండమైన మెజార్టీ ఇచ్చారు. కుల, మతాలకు అతీతంగా టీఆర్ఎస్‌ను ఆశీర్వదించారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటాను. టీఆర్ఎస్ అంటే తిరుగులేని రాజకీయ శక్తిగా మల్చడానికి పెద్దలు కేసీఆర్ నాకు ముఖ్యమైన బాధ్యత అప్పజెప్పారు. నాపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తాను. పార్టీని తరువాయి 2లో..

## నాలుగేళ్ల తర్వాత తలపాగాతో సచిన్

### రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం



జయపుర: తలపాగా ధరించడమంటే నాకెంతో ఇష్టం. కాంగ్రెస్ మళ్లీ అధికారంలో వచ్చే వరకూ నేను తలపాగా ధరించే ప్రసక్తే లేదు 2014 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయిన సమయంలో సచిన్ పైలట్ చేసిన వ్యాఖ్యలివి. అన్నట్లుగానే నాలుగేళ్ల తర్వాత కాంగ్రెస్ విజయంతో మళ్లీ తలపాగా ధరించి రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రిగా సచిన్ నేడు ప్రమాణస్వీకారం చేశారు.

రాజస్థాన్‌లో మొత్తం 25 లోక్‌సభ నియోజకవర్గాలున్నాయి. 2014 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం పాలైంది. తరువాయి 2లో..

### రక్షణ ఒప్పందాలపై

# అసత్య ప్రచారం

### నిప్పులు చెరిగిన ప్రధాని మోదీ



రాయ్ బరేలి: కేంద్ర ప్రభుత్వ రక్షణ ఒప్పందాల్లో ఖత్రోచి మామా, క్రిస్టియన్ మిచెల్ అంకుల్ లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారాలు చేస్తూ ఆందోళనలు నిర్వహిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. దేశ న్యాయ వ్యవస్థపై అపనమ్మకం కలిగేలా ప్రవర్తిస్తోందని నిప్పులు చెరిగారు. సోనియా గాంధీ నియోజకవర్గం రాయ్‌బరేలిలో ఆయన మాట్లాడారు. రాఫేల్ ఒప్పందంపై మోదీ ప్రభుత్వానికి సర్వోన్నత న్యాయస్థానం క్లీన్‌చిట్ ఇచ్చిన తరువాయి 2లో..

## అధికారులూ అప్రమత్తంగా ఉండండి

- ప్రజలు నష్టపోకుండా చూడండి
- భీమిలి , మంగమారిపేటలను సందర్శించిన మంత్రి గంటా
- బీచ్‌లో కూరుకుపోయిన గంటా కారు



భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గములో సోమవారం తుఫాన్ ముంపు ప్రాంతాలైన మంగమారిపేట మరియు భీమిలి బీచ్ పరిసర ప్రాంతాల్లో మంత్రి గంటా శ్రీనివాసరావు పర్యటించారు ప్రజలకు తుపాను వల్ల నష్టపోకూండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం భీమిలి క్యాంపు కార్యాలయం సమావేశం నిర్వహించారు. తీరప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను అప్రమత్తంగా ఉండాలని కోరారు. భీమిలి నియోజకవర్గ ఇంచార్జీ విజయ్ బాబు, డిఎల్ డీఏ చైర్మన్ గాడు వెంకటప్పడు , జెడ్పీటీసీ అప్పారావు, భీమిలి మండల పార్టీ తరువాయి 2లో..

## గెలుపైతే నాది.. ఓటమైతే మీది..

### ఇది బాబు నైజం.. వైకాపా రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి



విజయవాడ: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి మరోసారి ఏపీ సీఎం, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుపై నిప్పులు చెరిగారు. ఆయన ట్విట్టర్‌లోను సోమవారం నిప్పులు చెరిగారు. అలాగే పెథాయ్ తుఫాను కారణంగా ఏపీలో కోస్తా ప్రజలు అరచేతిలో ప్రాణాలు పట్టుకొని బిక్కుబిక్కుమంటున్న సమయంలో వారికి అండగా నిలవలేదని విమర్శిం చారు. ప్రజలకు అండగా ఉండి భరోసా ఇవ్వాల్సిన సమయంలో చంద్రబాబు ఇవేమీ పట్టించుకోకుండా, ఏపీలో పాలనను గాలికి వదిలేసి ప్రత్యేక విమానంలో రాజస్థాన్, మధ్యప్రదేశ్ వెళ్లి కాంగ్రెస్ పార్టీ కొత్త రాష్ట్రాల ముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకారోత్సవాల్లో బిజీగా తరువాయి 2లో..






మొదటి పేజీ తరువాయి

# బలహీనపడిన పెథాయ్



అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారు. ఈ తుపాను తీవ్రతతో గంటకు 80 కి.మీల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచాయి. రాజోలు, సఖినేటిపల్లి, అమలాపురం, మలికిపురం అంబాజీపేట, మామిడికుదురు , అల్లవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం మండలాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కాకినాడలో హోంమంత్రి చినరాజప్ప సహాయక చర్యలను పర్యవేక్షించారు.



51 మంది ప్రత్యేక అధికారుల నియామకం

పెథాయ్ తుపాను ప్రభావిత జిల్లాలపై ప్రభుత్వం సర్వత్రా అప్రమత్తమైంది. పరిస్థితిని మంత్రులు, సీఎస్ అనిల్ చంద్ర పునేఠ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రభావిత జిల్లాల్లో ప్రతి మండలానికి ఒక ప్రత్యేకాధికారిగా ఐఏఎస్‌లను కేటాయించారు. 51 మంది ప్రత్యేకాధికారులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించింది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటనకు సీఎం చంద్రబాబు సిద్ధమవుతున్నారు. మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల ప్రమాణస్వీకారానికి వెళ్లిన ఆయన రాజమహేంద్రవరం లేదా విశాఖలో విమానం దిగే అవకాశం లేకపోవడంతో నేరుగా అమరావతి రానున్నారు. అక్కడ మంత్రులు, అధికారులతో సమీక్ష అనంతరం క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లడంపై నిర్ణయం తీసుకోనున్నారు. ఆర్టీజీఎస్ నుంచి మంత్రులు కళా వెంకట్రావు, కిడారి శ్రవణ్ తుపాను ప్రభావాన్ని సమీక్షిస్తున్నారు.

నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

పెథాయ్ ప్రభావంతో కురుస్తోన్న వర్షాలకు తూర్పుగోదావరి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఎడతెరిపిలేకుండా కురుస్తోన్న వర్షాల వల్ల ధాన్యం చాలా వరకు తడిసిపోయింది. తడిసిన బస్తాలను వేరే బస్తాల్లోకి మార్చి రవాణా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందువల్ల ఈ కేంద్రాల్లో కొనుగోళ్లు నిలిచిపోయాయి. పశ్చిమగోదావరి జిల్లాలోనూ సముద్ర అలలు ఎగసిపడుతున్నాయి. జిల్లాలో గాలులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. ఇప్పటికే ముందస్తు చర్యల్లో భాగంగా 13 చోట్ల ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వృద్ధులను తరలించారు. పునరావాస శిబిరాల వద్ద తాగునీరు, ఇతర నిత్యవసరాలను సిద్ధం చేశారు.

వరి రైతుకు తీరని నష్టం!

వరి రైతులకు పెథాయ్ తీరని నష్టాన్ని మిగిల్చింది. చివరి దశలో ఉన్న పంటపై

తుపాను విరుచుకుపడింది. రాత్రి నుంచి జిల్లాలో కురుస్తోన్న వర్షాలకు వరిపంట పూర్తిగా నాశనమైంది. పశ్చిమగోదావరి జిల్లా దెందులూరు, పెదపాడు, నరసాపురం, మొగల్తూరు, పెదవేగి, ఏలూరు గ్రామీణ మండలాల్లో పంట నీటమునిగింది. కోతకోసి పొలాల్లో ఉన్న ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. జిల్లాలో సుమారు 40 వేల ఎకరాల్లో వరిపంటకు నష్టం జరిగింది. రాకాసి తుపాను కారణంగా తీవ్రంగా నష్టోయామని రైతులు వాపోతున్నారు. ఎకరానికి రూ.35 వేలు నుంచి 40వేల వరకు తాము పెట్టుబడి పెట్టామని, ఆ డబ్బులు చేతికి వస్తాయో, రాదో అర్థంకావడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

కృష్ణాలో భారీగా పంట నష్టం

పెథాయ్‌తో కృష్ణా జిల్లాలో పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. తూర్పు కృష్ణాలోని కోసిన వరిపంటలు నీటమునిగాయి. రెండో పంటగా వేసిన మినుము మొలక దశలో ఉన్న పొలాలు దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నూజివీడులో మొక్కజొన్న, పొగాకు, పత్తి, కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. నందిగామ, జగ్గయ్యపేట, పెనుగ్రంచిప్రోలు, తిరువూరు తదితర చోట్ల పత్తి, మిరప పంటలకు తీవ్ర నష్టంవాటిల్లింది.

అనకాపల్లి - తుని మధ్య

రాకపోకలపై ఆంక్షలు : కలెక్టర్ ప్రవీణ్ కుమార్

పెథాయ్ నష్టాన్ని వీలైన మేరకు తగ్గించేందుకు విశాఖ జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ ప్రవీణ్ కుమార్, విశాఖ కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. తుపాను ప్రభావం అధికంగా ఉండే మండలాల్లో సహాయక చర్యలకు జాతీయ, రాష్ట్ర సహాయక బృందాలను అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ.. జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులను అప్రమత్తం చేశామన్నారు. జిల్లాలోని 5 మండలాల్లో ప్రభావం ఉంటుందని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. 57 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, తాగునీరు, ఆహారం సిద్ధంగా ఉంచినట్టు వివరించారు.

మడ అడవుల వల్ల

కాకినాడకు తుపాను తీవ్రత తగ్గే అవకాశం

మరో గంటన్నరలో కాకినాడ -యానం మధ్య తుపాను తీరం దాటే అవకాశం ఉందని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా తెలిపారు. మడ అడవుల వల్ల కాకినాడకు తుపాను తీవ్రత తగ్గే అవకాశం ఉందన్నారు. రహదారులపై పడిన చెట్లను ఎప్పటికప్పుడు తొలగించే ఏర్పాట్లు చేసినట్టు వెల్లడించారు. పునరావాస శిబిరాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. విద్యుత్ సరఫరాకు జనరేటర్లను ఏర్పాటు చేశామన్నారు.

స్తంభించిన రవాణా వ్యవస్థ

తూర్పు గోదావరి జిల్లా కాట్రేనికోన వద్ద తీరాన్ని తాకిన తుపాను మధ్యాహ్న సమయంలో కాకినాడ-యానం వద్ద తీరం దాటింది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. గత రెండు రోజుల నుంచే ఆకాశం మేఘావృతమై చలిగాలులు వీస్తుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. తుపాను ప్రభావంతో పలుచోట్ల రవాణా వ్యవస్థ స్తంభించింది. కొన్ని చోట్ల బస్సులు, రైళ్లు, విమానాలను రద్దు చేయగా.. మరికొన్నింటిని దారి మళ్లిస్తున్నారు. కొన్ని రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. భారీ వర్షాలు, గాలుల తాకిడికి పలుచోట్ల సెల్‌టవర్లు పనిచేయడం లేదు. సమాచార వ్యవస్థను వెంటనే పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

రద్దైన రైళ్ల వివరాలివే

విశాఖపట్నం నుంచి విజయవాడ, గుంటూరు మీదుగా సికింద్రాబాద్ వెళ్లే జన్మభూమి, రత్నాచల్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు సహ 47 ప్యాసింజర్ రైళ్లను అధికారులు రద్దు చేశారు. రద్దైన రైళ్ల వివరాలు..

రైలు నెంబరు 67243 కాకినాడ పోర్టు-విశాఖ, 57225 విజయవాడ-విశాఖ ప్యాసింజర్, 57226 విశాఖ-విజయవాడ ప్యాసింజర్, 67295 రాజమహేంద్రవరం-విశాఖ ప్యాసింజర్, 67247 రావికంపాడు-విశాఖ ప్యాసింజర్, 67296 విశాఖ-రాజమహేంద్రవరం ప్యాసింజర్ రైళ్లతో పాటు మరికొన్నింటిని అధికారులు రద్దు చేశారు.



విశాఖ విమానాశ్రయంలో

750 మంది ప్రయాణికుల నిరీక్షణ

తుపాను ప్రభావంతో విశాఖలో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం



ఏర్పడింది. విశాఖకు రావాల్సిన మొత్తం 14 విమాన సర్వీసులు రద్దయ్యాయి. దాదాపు 750 మందికి పైగా ప్రయాణికులు విమానాశ్రయంలోనే ఉండిపోయారు. వీరికి ఆయా విమానయాన సంస్థలు మంచినీరు, ఆహార ఏర్పాట్లు చేశాయి. గాలుల తీవ్రత ఎక్కువగా ఉండడంతో కొన్ని విమానాలను హైదరాబాద్‌కు మళ్లించారు. అయితే ఉదయం రెండు విమానాలను విశాఖ నుంచి దిశను మార్చుకుని పంపినప్పటికీ.. గాలుల తీవ్రత పెరగడంతో ఆ తర్వాత సాధ్యపడలేదు.

పలుచోట్ల కూలిన చెట్లు

పెథాయ్ తుపాను ధాటికి పలుచోట్ల చెట్లు నేలకూలాయి. ఉభయగోదావరి జిల్లాలతో పాటు విశాఖ జిల్లాలో రోడ్లపై చెట్లు కూలిపోయాయి. విశాఖ జిల్లా నర్సీపట్నం ప్రాంతంలో రోడ్లపై కూలిన చెట్లను తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నర్సీపట్నం ఐదురోడ్ల కూడలి వద్ద చెట్లు కూలడంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. స్థానిక పోలీసులు, మున్సిపల్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి ప్రజాజీవనానికి ఇబ్బందులు లేకుండా చేస్తున్నారు. అనకాపల్లి - తుని మధ్య రాకపోకలపై ఆంక్షలు పెట్టినట్టు విశాఖ జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు.

భీమిలి నియోజకవర్గంలో పలు మత్స్యకార గ్రామాలను మంత్రి గంటా శ్రీనివాసరావు సందర్శించారు. కలెక్టర్‌తో మాట్లాడి పరిస్థితిపై ఆరా తీశారు. విశాఖ మన్యంలోని 11 మండలాల్లో గాలులతో కూడిన వర్షాల కురుస్తున్నాయి. చింతపల్లి, జీకేవీధి, అనంతగిరి మండలాల్లో గాలుల ప్రభావం ఎక్కువగా ఉంది. పలుచోట్ల చెట్లు నేలకొరగడంతో అధికారులు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అధికారులు స్థానికంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని మంత్రి కిడారి శ్రవణ్ ఆదేశించారు. తుపాను తీరం దాటే వరకు ప్రజలు ఎవరూ కూడా ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అధికారులు సూచించారు. ముఖ్యంగా తూర్పు గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లా వాసులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## మొదటి పేజీ తరువాయి

### పెథాయ్ తుపానుపై చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

అధికారులు, సిబ్బంది ఇందులో పాల్గొన్నారు. విపత్తుల సమయంలో ఎవరూ సెలవులు పెట్టరాదని.. అందరూ విధులకు హాజరై అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించాలని సీఎం స్పష్టం చేశారు. మన రాష్ట్రంలో విపత్తులు కొత్త కాదని, భవిష్యత్తులోనూ తుపాన్లు వస్తాయన్న ఆయన... అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు తుపాన్ల కాలమేనని గుర్తుచేశారు. ప్రతి జిల్లాలో ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

తుపాను ప్రభావంతో ఉభయ గోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళంలో భారీ వర్షాలు పడతాయన్న చంద్రబాబు ముందు జాగ్రత్త చర్యలతో జన నష్టం, పశునష్టం నివారించాలని ఆదేశించారు. ప్రజల ఇబ్బందులను తగ్గించాలని సూచించారు. అన్నివర్గాల ప్రజల్లో ప్రభుత్వం అండగా ఉంటుందనే భరోసా ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. అన్ని వనరులను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో ప్రత్యేక అధికారి బాధ్యత తీసుకుని.. గ్రామంలో అందరినీ చైతన్యపరచాలని పేర్కొన్నారు. సహాయ చర్యల్లో ఆపద మిత్రలు భాగస్వాములు కావాలని సూచించారు. ముంపు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి.. పునరావాస కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. అల్పాహారం, భోజనం, తాగునీరు అందించాలని.. పాలు, కూరగాయలతో సహా నిత్యావసరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.

మంత్రులు అందరూ తమతమ మండలాలకు చేరాలని ఆదేశించారు. సహాయ చర్యలలో పార్టీ నేతలు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సహాయ పునరావాస చర్యలు మనందరి బాధ్యతని, కేవలం ప్రభుత్వమే కాకుండా, అన్నివర్గాల ప్రజలు చేయూత అందించాలని చెప్పారు.

### సంస్థాగత నిర్మాణం కోసం కృషి చేస్తా

అజేయమైన శక్తిగా మలిచే క్రమంలో మీ ఆశీర్వాదం కోరుకుంటున్నాను. బంగారు తెలంగాణ కోసం సవ్యంగా పని నిర్వర్తిస్తాను. పార్టీ కార్యాలయాల నిర్మాణం, శిక్షణ, సంస్థాగత నిర్మాణం కోసం కృషి చేస్తా. ప్రజలకు వందేళ్లు సేవ చేసేలా పార్టీ కార్యక్రమాలను తీర్చిదిద్దుతా. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య పార్టీ ఉండేలా కృషి చేస్తాను. భగవంతుడు నాకిచ్చిన శక్తిని మీకోసం వినియోగిస్తా.. తనకు మద్దతు తెలుపుతూ ఇక్కడికి వచ్చిన ప్రజలందరికీ వినమ్రంగా, హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తూ.. శిరసు వంచి పాదాభివందనం చేసుకుంటున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు.

### రక్షణ ఒప్పందాలపై అసత్య ప్రచారం

తర్వాత ఆయన బహిరంగంగా మాట్లాడటం ఇదే తొలిసారి. భారత సైనిక దళాలు పటిష్ఠం కావడం కాంగ్రెస్ పార్టీకి అస్సలు ఇష్టం లేదని ఆయన విమర్శించారు. కొందరు కేవలం అబద్ధాలు మాత్రమే నమ్మి వాటినే ప్రజలతో పంచుకుంటారని రామ్‌చరిత మానస్‌లోని ఉదాహరణలిచ్చారు.

ఆ కొద్దిమందికీ రక్షణ మంత్రిత్వ శాఖ, రక్షణ మంత్రి, భారతీయ వాయుసేన, ఫ్రాన్స్ ప్రభుత్వం అన్నీ అసత్యాలుగానే కనిపిస్తాయి. ఇప్పుడు సుప్రీం కోర్టు సైతం అబద్ధం చెప్పినట్టే వారికి కనిపిస్తోంది అని కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి మోదీ అన్నారు. కాంగ్రెస్ ఒప్పందాల్లో మాత్రం ఖత్రోచి మామ (ఇటలీ వ్యాపారి) కనిపిస్తారని విమర్శించారు. ప్రధాని రాజీవ్ గాంధీ 1986లో చేసుకున్న బోఫోర్స్ ఒప్పందంలో ఖత్రోచి మధ్యవర్తి అని ఆరోపణలు ఉన్న సంగతి తెలిసిందే. ఇక అగస్టా వెస్ట్‌ల్యాండ్ చాపర్ కేసును ఉదహరిస్తూ కొద్ది రోజుల క్రితం మేం క్రిస్టియన్ మిచెల్ అంకుల్‌ను భారత్‌కు తీసుకొచ్చాం అని మోదీ వెల్లడించారు. రూ.3,600 కోట్ల అగస్టా హెలికాప్టర్ల కుంభకోణంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులకు లంచాలు ఇవ్వజూపారని మిచెల్‌ను విచారిస్తున్నారు.

ప్రతి ఒక్కరూ నిందితుడి (క్రిస్టియన్ మిచెల్)ని రక్షించాలనే ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ తన లాయర్‌ను న్యాయస్థానానికి పంపించింది. కాంగ్రెస్ పార్టీ ఎందుకు అదే పనిగా ఆందోళనలు చేస్తూ అసత్యాలను ప్రచారం చేస్తోందని ప్రశ్నిస్తున్నా. భాజపా రక్షణ ఒప్పందాల్లో ఖత్రోచి మామా, క్రిస్టియన్ అంకుల్ లేనందుకేనా? న్యాయ వ్యవస్థపై విశ్వసనీయత పోగొట్టాలనా? అని మోదీ ప్రశ్నించారు. కార్గిల్ వివాదాన్ని ఉటంకిస్తూ ప్రధాని ఆధునిక యుద్ధ విమానాల ఆవశ్యకత ఉందని చెప్పారు.

కాంగ్రెస్ పదేళ్లు దేశాన్ని పరిపాలించింది. వైమానిక దళం పటిష్ఠం అయ్యేందుకు అవకాశం ఇవ్వలేదు. ఎందుకు? ఎవరి ఒత్తిడి మేరకు? 2009లో భారత సైన్యం 1.86 లక్షల బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు కావాలని అడిగింది. యూపీఏ-2 ఐదేళ్ల పాలనలో ఒక్కటీ కొనుగోలు చేయలేదు. మేం అధికారంలోకి రాగానే 2016లో 50,000 జాకెట్లు కొనుగోలు చేశాం. ఈ ఏడాది స్వదేశీ కంపెనీ నుంచి 1.86 లక్షల జాకెట్లు ఆర్డరిచ్చాం అని మోదీ తెలిపారు.

### నాలుగేళ్ల తర్వాత తలపాగాతో సచిన్

కనీసం ఒక్కటంటే ఒక్క లోక్‌సభ స్థానంలోనూ హస్తం పార్టీ విజయం సాధించలేకపోయింది. దీంతో కాంగ్రెస్ నేతలు తీవ్ర అసంతృప్తి చెందారు. ఆ సమయంలో సచిన్ ఈ తలపాగా శపథం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చేంత వరకు తనకెంతో ఇష్టమైన తలపాగాను ధరించబోనని శపథం చేశారు.

### గెలుపైతే నాది.. ఓటమైతే మీది..

ఉన్నారని ధ్వజమెత్తారు. రియల్ టైమ్ గవర్నెన్స్ అంటే ఇదే కాబోలు అన్నారు.

‘మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ గెలుపు మీ వల్లేనని సొంత డబ్బా కొట్టుకుంటున్నారు. అక్కడ మీరు ప్రచారం చేయలేదు. తెలుగు వాళ్లు లేరు. ఆ గెలుపునకు మీకు ఏమి సంబంధం లయ్యర్ చంద్రబాబు. మీరు పంపిన డబ్బును పంచి కాంగ్రెస్ గెలిచిందా? లేక టెలీపతీ ద్వారా అక్కడి ఓటర్లను ప్రభావితం చేసారా?’ అని విజయసాయి రెడ్డి చంద్రబాబును ఉద్దేశించి ట్వీట్ చేశారు. ఇటీవల చంద్రబాబు మాట్లాడుతూ.. మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ గెలవడం వెనుక టీడీపీ పాత్ర ఉందని చెప్పారు.

చంద్రబాబు కారణంగా అమరావతికి రైలు లైన్ కల చెదిరిపోయిందని, యెర్రుపాలెం నుంచి అమరావతికి వేయాల్సిన డబుల్ లైన్ సింగిల్ లైన్‌గా మారిందని విజయసాయి విమర్శించారు. హవాలా ఏజెంట్ కీర్తి కుమార్ జైన్‌తో మీకు లింక్ గుర్తుకు వస్తుందా చంద్రబాబు అంటూ మరో ట్వీట్ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థులకు ఖమ్మంలో మీ బినామీ నామాకు ఎన్నికల కోసం హవాలాలో మీరు పంపిన రూ.5.8 కోట్లు పోలీసులు పట్టుకున్నారని పేర్కొన్నారు. బీజేపీ, టీఆర్ఎస్ కుట్ర చేస్తోందని సెలవివ్వాలని, అచ్చు వేయడానికి మీ యెల్లో కుల మీడియా ఎదురు చూస్తోందని పేర్కొన్నారు. మడకశిర ఎమ్మెల్యే అంశంలోను చంద్రబాబుపై విజయసాయి విమర్శలు గుప్పించారు.

### అధికారులూ అప్రమత్తంగా ఉండండి

అధ్యక్షుడు డిఎఎన్ రాజు , భీమిలి డివిజన్ ప్రెసిడెంట్ గంటా నూకరాజు, యరబాల అనీల్ ప్రసాద్, పాసి నర్సింగరావు , సర్పంచులు గరికిన సుధ కింగ్, మైలపల్లి రాము, యం.పి.టి.సి కారి అప్పారావు, కె.నాగరాజు, పి.యోగి, డెక్కన్ శ్రీను, కె.కామేష్ ఆర్.డి.ఓ, యం.ఆర్.ఓ, యం.పి.డి.ఓ, జోనల్ కమీషనర్, జిల్లా అధికారులు మరియు స్థానిక అధికారులు పాల్గొన్నారు.

*బీచ్‌లో ఇరుకున్న గంటా కారు*

భీమిలిలో ఫెథాయ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాలు భీమిలి మంగమారి పేటలను పరిశిలించడానికి సోమవారం భీమిలి బీచ్‌కి వచ్చిన మంత్రి గంటా శ్రీనివాసరావు వచ్చారు, ఆయన కారు భీమిలి బీచ్ ఇసుకలో ఇరుక్కు పోవడంతో ఆయన వేరే కారులో విశాఖపట్నం చేరుకున్నారు. ఆయన కారును ట్రాక్టర్‌తో బయటికి తీశారు.

## కొరంజిగుడలో సిమెంటు రోడ్డు నిర్మించాలి



అరకులోయః మండలం గన్నేల పంచాయతీ కొరంజిగుడ గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు ఆవేదన పడుతున్నారు. ఈ 20 ఏళ్ళలో రెండు మూడు ప్రభుత్వాలు అధికారంలో ఎన్నో సార్లు మా పల్లె పరిస్తితి చూశారు. అధికారులు వచ్చారు చూశారు. అయినా మా పల్లె సమస్య ఎవరికి పట్టడం లేదు. ఓట్ల కోసం అయితే అధికారులు నాయకులు వస్తారు. కాని మా రోడ్డు తదితర సమస్యల కొరకు ఎవ్వరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విలేకర్ల ముందు వాపోయరు.

## ఈదురుగాలులకు విరిగిపడిన చెట్లు



నర్సీపట్నంః ఫెథాన్ తుపాన్ ప్రభావంతో నర్సీపట్నంలో సోమ వారం వీచిన గాలులకు అక్కడ క్కడ చెట్లు నేలకొరిగాయి. ఈ చెట్లు విద్యుత్ వైర్లపై పడటంతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మున్సిపల్ సిబ్బంది, విద్యుత్ శాఖ సిబ్బంది ఎప్పటిక ప్పుడు పడిపోయిన చెట్లను తొల గించి విద్యుత్ పునర్దురిస్తున్నారు. తుపాన్ ప్రభా వంతో ఉదయం నుంచి భారీ ఈదురు గాలులు వీచాయి. ఒక మోస్తరు వర్షం కూడా పడింది. దీంతో జనజీవనానికి ఆటంకం ఏర్పడింది.

## మా పాఠశాల పరిస్థితి చూడండి సార్!



అరకులోయః మండలంలో నేటికి భస్కీదేవరపల్లి, బొండగుడ, తోకవలస, రేగ, గంగగుడి తదితర గ్రామాల్లో పాఠశాల భవనాలు లేక గిరిజన చిన్నారులు శిధిల మరియు పూరిపాకలోనే విద్యను అభ్యాసం చేస్తుంటే చిన్నారుల తల్లిదండ్రులకు గుండె తరుక్కుపోతోంది అని తల్లిదండ్రులు అంటున్నారు.

మండలంలో గుత్తేదారులు పాఠశాల భవనాలు కొన్ని ఏళ్ళ నుండి నిర్మాణం చేపట్టకుండ పిల్లర్ దశలోనే వదిలి వేయడం వలన గిరిజన చిన్నారులు పత్రిక వారికి మా పాఠశాల భవనాలు చూడండి సార్ ఇలాంటి శిధిల భవనాల్లో మా చదువులు సాగేదేట్ట అని అంటున్నారు.

## నేటి వరకు చర్మకారుల పింఛన్ దరఖాస్తు గడువు

నర్సీపట్నం : పింఛన్ల నిమిత్తం చర్మకారులు ఈ నెల 18వ తేదీ లోగా మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని నర్సీపట్నం ఏఎస్‌డబ్ల్యూఓ టి.సత్యనారాయణ సూచించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు.

చర్మకారులకు ప్రభుత్వం వెయ్యి రూపాయలకు పింఛన్ ప్రకటించినట్లు చెప్పారు. కులదృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డు, స్వీయ దృవీకరణ పత్రంతో మంగళవారం లోపు దరఖాస్తులు సమర్పిస్తే అర్హులందరికీ పింఛన్లు వర్తిస్తుందన్నారు.

## విలువలతో కూడిన విద్య
# బాలభాను ప్రత్యేకత



విశాఖపట్నం : నేటి సమాజంలో పిల్లలకు మంచి విద్యనందించడమే ప్రధన లక్ష్యమే. కానీ ఆ విద్య విలువలతో కూడినదై వుంటే విద్యార్థినీ విద్యార్థులకు పై తరగతులలో మంచి శిక్షణతో కూడిన నడవడిక, గుర్తింపు ఉంటుందని స్థానిక బాలభాను విద్యాలయ, వరల్డ్ టీచర్స్ ట్రస్ట్ ఇంటర్నేషనల్ చైర్మన్ కె. పార్వతీ కుమార్ పేర్కొన్నారు. బాలభాను స్కూలు 40వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ పిల్లలు బంగారు భవిష్యత్తుకోసం మంచి నడవడికను కలిగి ఉండాలని, సమాజంలో నడతకు ఇది మంచి మార్గమని ఆయన పేర్కొన్నారు. విద్యాలయ కరస్పాండెంట్ బిఆర్‌కె రాజు మాట్లాడుతూ తమ సంస్థకు కేవలం ఉత్తరాంధ్రలోనే కాక దేశ విదేశాలలో కూడా పాఠశాల బ్రాంచిలు ఉన్నాయని, అందులో చదువుతున్న విద్యార్థులు మంచి నడవడిక, విజ్ఞతతో కూడిన వారుగా పేరు తెచ్చుకోవడం తమకెంతో ఆనందంగా ఉందని అన్నారు. విద్యార్థుల విజ్ఞతే ఇందుకు నిదర్శనమన్నారు. బాలభానుకు మంచి పేరు వచ్చేందుకు ఉపాధ్యాయుల అంకితభావం, విద్యార్థుల శ్రద్ధాభక్తిప్రపత్తులే ఇందుకు ముఖ్య కారణమన్నారు. ఈ వార్షికోత్సవంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలలో పాఠశాల డైరెక్టర్స్ వి. పార్వతి, సూర్యారావు, సిహెచ్. సత్యదేవ్, యుబిహెచ్ వర్మ, వైస్ ప్రిన్సిపాల్ మనోరమణి, ఉపాధ్యాయులు రమణారావు, ప్రవీణ్ సూర్యకుమారి, పద్మజ, శారద, రజని, బాల, లక్ష్మి, ఉష, ఫణి తదితరులు పాల్గొన్నారు.




## ఆదరణ పరికరాల మార్పునకు 18వరకు గడువు

నాతవరం : వృత్తిదారులకు ఆదరణ పథకంలో పరికరాల మార్పునకు ఈ నెల 18 వరకు గడువు ఉందని ఎంపిడిఓ ఎల్.యాదగిరీశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 27 పంచాయతీల నుంచి 914 మంది ఆదరణ పరికరాలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరు ఎంపిక చేసుకున్న పరికరాలను మార్పు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. వివరాలకు 9000013925 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

## రూ.75లక్షల ఎంపీ నిధులు మంజూరు

రోలుగుంట : మండలంలోని అభివృద్ధి పనులకు అనకాపల్లి ఎంపి ముత్తంశెట్టి శ్రీనివాసరావు రూ.75లక్షలు నిధులు మంజూరు చేశారు. కొవ్వూరు, రోలుగుంట, కొండపాలెం, కొమరవోలు, కంచుగుమ్మలలో రూ.3.10 లక్షలతో బోర్లు, జానకిరాంపురం, ఎన్.కొత్తూరు, కె.నాయుడుపాలెంలో రూ.12లక్షలతో కమ్యూనిటీ భవనాలు, కొంతలం, రోలుగుంట, పడాలపాలెం, కొమరవోలు, కంచుగుమ్మల, కుసర్లపూడి సిసి రోడ్లు నిర్మించనున్నారు.

## తైక్వాండో క్రీడాకారులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లు

యలమంచిలి రూరల్ : యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తైక్వాండో క్రీడాకారులకు బెల్డ్ గ్రేడింగ్ టెస్ట్‌లు నిర్వహించినట్లు తైక్వాండో కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టెస్ట్‌లో 43 మంది క్రీడాకారులు తమ నైపుణ్యతను ప్రదర్శించారు. జి.జ్యోతి ఎగ్జామినర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో 20 మంది ఎల్లో బెల్టు, 10 మందికి గ్రీన్ బెల్ట్, ఏడుగురికి గ్రీన్ వన్, ఐదుగురు క్రీడాకారులకు బ్లూబెల్టులు సాధించినట్లు తెలిపారు. అత్యంత ప్రతిభ ప్రదర్శించిన క్రీడాకారులను కోచ్ సత్యనారాయణ, తైక్వాండో క్లబ్ ప్రతినిధులు అభినందించినట్లు తెలిపారు.



**కోస్టల్ సెక్యూరిటీ డీఐజీ సత్తార్ ఖాన్ ఆదేశాల మేరకు నగరంలో మెరైన్ పోలీసులు గస్తీ పెంచారు.. పెథాయ్ తుఫాను ప్రభావంతో నగరంలోని జోడుగుళ్ల పాలెం నుండి భీమిలి బీచ్ వరకు తీరప్రాంతలో నివసించే ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎటువంటి అనర్ధాలకు తావు ఇవ్వకుండా తగుజాగ్రత్తలు తీసుకున్నారు..తుఫాను సమయంలో లోతట్టు ప్రాంత ప్రజలకు తగిన సహాయ చర్యలు తక్షణమే అందించేందుకు గాను మెరైన్ పోలీసులు క్రూ సిబ్బంది తో పాటు గస్తీ నిర్వహించారు..ఎవరు సముద్రం లో ప్రవేశించకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మెరైన్ సిఐ డివిజే రమేష్ కుమార్, ఎస్ఐ రమేష్, సిబ్బంది గస్తీలో పాల్గొన్నారు.**

## తుపానుతో రైతులు జాగ్రత్తలు పాటించాలి

గొలుగొండ : తుఫాను సందర్బంగా పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలని గొలుగొండ పశువైద్యాధికారి బోళెం అశ్విని సూచించారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తుఫాను ప్రాంతాలలో పశువులను కట్టకుండా విడిగా వదిలేయాలన్నారు. కరెంటు స్తంభాలకు పశువులను దూరంగా ఉంచాన్నారు. పశు వులను తుఫాను సురక్షిత ప్రాంతాలకి తరలించడానికి రైతులకు గ్రామస్థాయి సిబ్బంది తగు సూచనలు ఇవ్వాలని చెప్పారు. మూగ జీవాలు తడవకుండా వీలైనంత మేరకు ఆశ్రయాన్ని కల్పించాలని, ప్రమాదవుసాత్తు ఎక్కడైనా పశు మరణాలు సంభవించినట్లైతే వెంటనే పశువుల పూర్తి వివరాలు, యాజమాని పూర్తి వివరముల సమాచారాన్ని తెలియజేయాలన్నారు. గ్రామస్థాయి సిబ్బంది అయిన పంచాయతీ కార్యదర్సులు, గ్రామ రెవిన్యూ అధికారులు పై విషయాలపై పాడి రైతులకు తగు సూచనలు ఇస్తూ సహాయపడవలసినదిగా కోరుతున్నాను.

## ఈదురుగాలులతో ఇబ్బందులు

రావికమతం : రావికమతం మండలం ఈదురుగాలులతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పెథాయ్ తుపాన్ ప్రభావంతో మండలంలో ఆదివారం నుంచి ఈదురుగాలులు ప్రారంభమయ్యాయి. సోమవారం కూడా భారీ ఎత్తున ఈదురుగాలులు వీచాయి. ఉదయం నుంచి ఓ మోస్తరుగా వర్షం పడింది. దీంతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది.

## ఆంధ్ర విశ్వవిద్యాలయం
# స్నాతకోత్సవం వాయిదా
## రిజిస్ట్రార్ ఆచార్య కె.నిరంజన్

ఏయూ : ఆంధ్రవిశ్వవిద్యాలయం స్నాత కోత్సవం వాయిద పడింది. పెథాయ్ తుఫాను కారణంగా స్నాతకోత్సవాన్ని వాయిదా వేసినట్లు రిజిస్ట్రార్ ఆచార్య కె.నిరంజన్ తెలిపారు. ఈ నెల 19వ నిర్వహించాల్సిన స్నాతకోత్సవాన్ని తుఫాను కారణంగా తాత్కా లికంగా వాయిదా వేయడం జరిగిందన్నారు. స్నాతకోత్సవంలో పిహెచ్‌డి, మెడల్స్, ప్రైజులు స్వీకరించేవారు వివిధ ప్రాంతాల నుంచి రావాల్సి ఉంది. ప్రస్తుతం తుఫాను కారణంగా రవాణా వ్యవ స్థలకు సైతం పలు ఇబ్బందులు ఎదురయ్యాయి. వీటన్నిం టిని పరిశీలిచిన ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా ముందు జాగ్రత్తగా స్నాత కోత్సవాన్ని వాయిదా వేయడం జరిగిందన్నారు. స్నాత కోత్సవం తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తా మన్నారు. మార్పును గమనించి అందరూ సహకరించాలని ఆయన సూచించారు.

## ప్రజలు అప్రమత్తతతో వ్యవహరించి
# అధికారులకు సహకరించాలి

- పెథాయ్ తుఫాను దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి - అధికారులకు సహకరించాలి
- కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి పర్యవేక్షించిన కమిషనర్
- ప్రజలను అప్రమత్తం చేయడానికి అనౌన్స్‌మెంట్స్
- అధికారులు ఎటువంటి సమస్యనైనా ఎదుర్కోడానికి సిద్ధం కావాలి
- ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలి

**- జివిఎంసి కమిషనర్ హరినారాయణన్**



విశాఖపట్నం, డిశంబరు 17:- జివియంసి పరిధిలోని ప్రజలందరు అప్రమత్తతతో వ్యవహరించి, అధికారులకు సహకరించాలని కమిషనర్ హరినారాయణన్ పేర్కోన్నారు. పిధాయ్ తుఫాను హెచ్చరికలు దృష్ట్యా ప్రజలు సహకరించి సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం ఉదయం క్షేత్ర పర్యటన సందర్భంగా అధికారులకు సెట్ కాన్ఫరెన్స్ ద్వారా తుఫాను, అనంతర పరిణామాలు తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో తుఫాను గమనం, తుఫాను హెచ్చరికలను పర్యవేక్షించి పలుసూచనలు చేశారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సిబ్బంది తుఫాను హెచ్చరిక, జాగ్రత్తచర్యలు గురించి అనౌన్స్‌మెంట్ ద్వారా అప్రమత్తం చేశారు. అందరు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి సహాయ, పునరావాస చర్యలు అవసరమైన చోట చేపట్టాలని ఆదేశించారు. ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పేర్కోన్నారు.

## రెల్లి కులస్తుల వనభోజనాల సందడి



విశాఖపట్నంః చిన్న వాల్తేర్‌లోని రెల్లి వీధి గ్రామ సంఘ ఆధ్వ ర్యంలో రెల్లి కులస్తుల ఆనందాల ఆహ్లాద పిక్నిక్ కైలాసగిరి లో నిర్వహించారు. ఈ పిక్నిక్ లో సంఘ అధ్యక్షుడు డాక్టర్. చెన్న గౌరీ శంకర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రెల్లి కులస్తుల మధ్య ఆనందాల ఐక్యతను పెంపొం దించడానికి ఈ వనభోజనాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇటు వంటి కార్యక్రమాల వల్ల అందరి మధ్య సహృదయ భావన కల్గించవచ్చును అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు మాట్లాడుతూ రెల్లి కులస్తుల అభివృద్ధి కి ఎల్లప్పుడూ అండదండలుగా ఇస్తామని తెలిపారు. అనంతరం డాక్టర్. చెన్న గౌరీ శంకర్ ను ఘనంగా సన్మానించారు. సామాజికవేత్త కోన చిన్నారావు మాట్లాడుతూ రెల్లి కులస్తు లు ఎంతో వెనుకబాటుతనాన్ని అనుభవిస్తున్నారని వారి అభివృద్ధికి అన్ని పార్టీలు కలిసి రావాలని కోరారు. పిక్నిక్ లో భాగంగా వివిధ ఆటలు పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందించారు.రెల్లి కులస్థులంతా సరదాగా ఆడిపాడి బంధువులతో ఎంజాయ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రెల్లి కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మకాయల అప్పారావు, సభ్యులు చెన్నా వెంకట్రావు, మీసాల గురుమూర్తి, చెన్నా దాసు, కుప్పిలి నారాయణ రావు, రమేష్, గోవిందరావు,ఈ. లక్ష్మణ్, గురుమూర్తి, ఏ.సతీష్, అధిక సంఖ్యలో రెల్లి కులస్తులు మహిళలు తదితరులు కుటుంబ సమేతంగా హాజరై సందడి చేశారు.

# విజయభాను

## సంపాదకీయం

# ఎన్నికల అస్త్రం రాఫెల్

రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో సందేహించవలసిందేమీ లేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందున వల్ల వివాదం సద్దుమణగనప్పటికీ, ప్రభుత్వం ధైర్యంగా ముందడుగు వేయడానికి అవకాశం ఏర్పడ్డది. ఈ ఒప్పందంలో అక్రమాలు జరిగినందున ఎఫ్ఐఆర్ నమోదు చేయవలసిందిగా సీబీఐకి ఆదేశాలంటూ ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. ఈ కేసులో పిటిషనర్లు లేవనెత్తిన అనేక అంశాలను ప్రస్తావించి ప్రభుత్వ నిర్ణయాధికారాన్ని న్యాయస్థానం సమర్థించింది. ప్రభుత్వ నిర్ణయ ప్రక్రియలో సందేహించవలసిందేమీ లేదని పేర్కొన్నది. యుద్ధ విమానాలు 36 కొనాలా లేక 126 కొనాలా అనేది ప్రభుత్వ నిర్ణయం. యుద్ధ విమానం నాణ్యతపై అనుమానం లేదు కనుక, ప్రభుత్వం ఎంత పెట్టి కొంటున్నదనే లెక్కలు తీయడం న్యాయస్థానం పని కాదు. ఇందుకు సంబంధించి న్యాయస్థానం జోక్యం చేసుకునేంత ఆధారాలు లేవు. కొందరు వ్యక్తులు అవినీతి జరిగిందని అనుకున్నంత మాత్రాన సున్నితమైన రక్షణ కొనుగోళ్ళ విషయంలో జోక్యం చేసుకోవడం సబబు కాదు అని న్యాయస్థానం స్పష్టం చేసింది. డసాల్ట్ ఏవియేషన్ అనే ఫ్రెంచి కంపెనీ ప్రతిలబ్ధి నిబంధనకు అనుగుణంగా భారతీయ భాగస్వామి (రిలయన్స్ డిఫెన్స్) ఎంచుకోవడం కోసమే యుద్ధ విమానాల ధర ఎక్కువగా నిర్ణయించారనే పిటిషనర్ల వాదన కూడా నిలువ లేదు. ఈ ఒప్పందంలో వాణిజ్యపరమైన పక్షపాతం కనిపించడం లేదని న్యాయస్థానం అభిప్రాయపడ్డది.

యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలోని వాస్తవాలు ఎట్లా ఉన్నప్పటికీ, రాఫెల్ ఎన్నికల యుద్ధంలో ప్రధాన అస్త్రంగా మాత్రం బాగా ఉపయోగపడ్డది. ఇటీవల రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్, బీజేపీ ముఖాముఖి తలపడ్డాయి. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రాఫెల్ ఒప్పందంలో అవినీతి జరిగిందంటూ ప్రచారం సాగించారు. చౌకీదార్ చోర్ హై అంటూ ప్రధాని మోదీపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ మూడు రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడానికి ఈ ప్రచారమే కారణమని చెప్పలేము కానీ, ఈ అవినీతి ఆరోపణలు బీజేపీని చాలా ఇరుకున పడేశాయనేది వాస్తవం. రాఫెల్ ఒప్పందంలో సుప్రీంకోర్టు తీర్పు కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ఇచ్చిన నేపథ్యంలో రాహుల్ గాంధీ తాను చేసిన ఆరోపణలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ తప్పుడు ప్రచారం చేశారని అంటూ, వీరికి సుప్రీంకోర్టు తీర్పు మొహంపై కొట్టినట్టుగా ఉందని అన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం సుప్రీంకోర్టు తీర్పుతో ఏకీభవించడానికి కానీ, ఆరోపణలను ఉపసంహరించుకోవడానికి కానీ సిద్ధంగా లేదు. ప్రభుత్వం సుప్రీం కోర్టుకు మొత్తం సమాచారం ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ అంటున్నది. సున్నితమైన రక్షణ ఒప్పందంలోని అక్రమాలను తేల్చవలసింది న్యాయస్థానం కాదనీ, పార్లమెంటేనని తాము మొదటి నుంచి ఇదే వాదన వినిపిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా సమర్థించుకున్నారు. సంయుక్త పార్లమెంటరీ సంఘాన్ని (జేపీసీ)ని నియమించి రాఫెల్ ఒప్పందంలోని అక్రమాలపై దర్యాప్తు జరపాలని ఆయన ఇంకా డిమాండ్ చేస్తూనే ఉన్నారు. రాజీవ్ గాంధీ హయాంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు బోఫోర్స్ అస్త్రాన్ని ప్రయోగించాయి. ఆ తరువాత అధికారానికి వచ్చిన జనతా నాయకులు బోఫోర్స్ గురించి అడిగితే, అదొక పెద్ద సమస్య కాదని, అంతకు మించిన సమస్యలు చాలా ఉన్నాయని తేలిగ్గా తీసిపారేశారు. ఆ తరువాత ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎన్ని విచారణలు జరిగినా ఒక్క దోషిని పట్టుకోవడం జరుగలేదు. కానీ దేశ రక్షణకు ఎంతో అవసరమైన బోఫోర్స్ తుపాకులను మరిన్ని కొనుగోలు చేయడం ఈ దుమారం మూలంగా ఆగిపోయింది. ఇప్పుడు రాఫెల్ ఒప్పదంపై తమ ప్రచారాన్ని ఆపడానికి కాంగ్రెస్ సిద్ధంగా లేదు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నందు వల్ల ఈ అవినీతి ఆరోపణలను మరింత ఉధృతంగా చేసినా ఆశ్చర్యం లేదు. రాఫెల్ యుద్ధ విమానాల తయారీలో మన పబ్లిక్ రంగ పరిశ్రమ అయిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) ప్రమేయం ఉంటే బాగుండేది. కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అటువంటి ఒప్పందాన్ని కుదుర్చుకోలేక పోయింది. ఇప్పుడు అ పరిస్థితి దాటిపోయింది. తాజా ఒప్పందంలో అవినీతి ఉన్నదా లేదా అనేదే చర్చ. అయితే రాఫెల్ ఒప్పందంపై ఇచ్చిన తాజా తీర్పులో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్య ఒకటి గమనించదగినది. మన ప్రత్యర్థులు నాలుగవ తరమే కాదు, ఐదవ తరం యుద్ధ విమానాలు తెచ్చుకున్నట్టు తెలుస్తున్నది.

### వైసీపీ కన్వీనర్ అక్కరమాని విజయనిర్మల

# బోయివీధి, మంగమారి పేట సందర్శన



భీమునిపట్నం : భీమిలి ఫథాయ్ తుపాన్ కు మత్సకారుల ఉండే బీచ్ పక్క గ్రామాలు ని వై.సి.పి.కన్వీనర్ అక్కరమాని విజయనిర్మల బోయివీధి మంగమారి పేట వెళ్లి మత్సకారుల గ్రామాలను సోమవారం సందర్శించారు ,మత్సకారుల ప్రతి ఇంటికి వెళ్లి వారు పడుతున్న కష్టాలు చూసి వారితో మాట్లాడారు.ప్రభుత్వం ఇప్పటవరకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే విజయనిర్మల స్పందించి మత్సకారులకి మంగమారి పేట లో భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దూడ అచ్చారావు,పట్టణ నాయ కులు అక్కర మాని వెంకట్రావు, జీరు వెంకటరెడ్డి, రామాసురప్పడు, జిల్లా కార్యదర్శి కాసరపు పెద్ద ఎల్లాజీ,,భింగి హరి కిరణ్ రెడ్డి,,, గుండాసి మధునాయుడు కాసరపు.చిన్నఎల్లాజీమ, గ్రామస్తులు తదితర నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం

### పురపాలక ఛైర్మన్ ప్రసాదుల రామకృష్ణ



విజయనగరం : పురపాలక పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని పురపాలక ఛైర్మన్ ప్రసాదుల రామకృష్ణ అన్నారు. సోమవారం ఉదయం 1వ వార్డు పరిధిలోని గాజులరేగ ప్రాంతంలో 40లక్షల నిధులతో మంజూరైన బిటి రోడ్డు పనులకు పురపాలక ఛైర్మన్ ప్రసాదుల రామకృష్ణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక పరిధిలో ప్రతి వార్డుకు అభివృద్ధి పనుల నిమిత్తం కోటి రూపాయల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ పనులను ఫిబ్రవరి మొదటివారంలో ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నా మన్నారు. అలాగే ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న పనులను నెలరోజుల్లోగా పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. పనుల నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. పనులలో నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్లకు బిల్లులు నిలుపుదల చేస్తామన్నారు.

అలాగే సదరు కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెడతామన్నారు. ఈ కార్య క్రమంలో తెలుగుయువత అధ్యక్షుడు కర్రోతు వెంకట నర్సింగరావు, 1వ వార్డు కౌన్సిలర్ సోము శ్రవంతి, గాజులరేగ మాజీ సర్పంచ్ పత్తిగుళ్ల సూర్యకుమారి, ఎంఇ మత్స్య రాజు, డిఇ వంశీ, ఎఇ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# 10వరోజు మార్గశిర మాసోత్సవాలు - 2018



విశాఖపట్నం : శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో మార్గశిర మాసోత్సవములు సందర్భంగా శ్రీ చక్రనవవర్నార్చన, లక్ష్మీ హోమం, వేదపారాయణ, సప్తశతీ పారాయణ, మహావిద్యాపారాయణ నిర్వహించుటు జరిగింది. 10వరోజు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతిరోజు నిర్వహించు అన్నప్రసాద వితరణలో భాగంగా సోమవారం వెయ్యిమంది భక్తులకు నిర్వహించుట జరిగింది. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా నేడు ఎం.లలిత, లలితా డాన్స్ అకాడమీ వారిచే 'కూచిపూడి' నృత్యం ఏర్పాటు చేయడమైనది. శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో నేడు స్వర్ణ పుష్పార్న (అష్టదళ పద్మారాధన) 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేక పూజ ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు నిర్వహించబడును.

# మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి



విజయనగరం : ప్రజలకోసం తమ జీవితాలను త్యాగంచేసిన మహనీయులను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని పురపాలక ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు అప్పయ్యశెట్టి అన్నారు. పొట్టి శ్రీరాములు 66వ వర్ధంతిని పురష్క రించుకుని స్థానిక పురపాలక కార్యాలయంలో ఉద్యోగులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అప్పయ్యశెట్టి మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే దేన్నైనా సాధించవచ్చునని పొట్టి శ్రీరాములు నిరూపిం చారన్నారు. ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి పొట్టిశ్రీరాములు ఎందరికో ఆదర్శప్రాయుడయ్యా డని కొనియారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్య దర్శి టి.వి.పి.అప్పా రావు, ఉపాధ్యక్షుడు అప్పలరాజు, పురపాలక మేనేజర్ ప్రసాద రావు, ఎఓ రోజా, సీనియర్ అసిస్టెంట్ భారతి తదితరులు పాల్గొన్నారు.

## కవి సమయం

### భక్తి మార్గం - దైవ సంకల్పం

పారిపోతే ఊరుకోరు ఊరువారు
పరుపరుగున పట్టుకుంటు దేవుడుని
రోజువారి దేవుడంటే ప్రేమతో
ప్రేమ ప్రజలు కళ్ళల్లో దేవుడని.
చెప్పింది చేస్తున్న దినంవారి
శిరస్సొంచి మొక్కుతున్న రోజువారి
మలినమును తీసేసి
మనసు నిండ మంచిని నింపేసి.
విశ్వమంత మీరేగ
ఎండ, వాన, గాలి, మీదేగ
నిము నిముషం కదలికలో
అడుగడుగున నడకల్లో
దేవుడే - దేవుడు.
ఇబ్బంది పుచ్చుకుంటు
కళ్ళ కందు కున్నవారు
ప్రాప్తిని మొక్కుకుని
దేవ, దేవ అనుకుని
ప్రాప్తిని మెచ్చుకో...
ఇబ్బంది దేవుడని మొక్కుకో...
చేసింది ఎంతైన
శ్రమ హెచ్చని నొచ్చుకోకు
భాగ్యాన్ని యిచ్చినోడు
భగవంతుడుని వేడుకో.
నిత్యం, సత్యం నీ వెంటే
ఆ వెంబడి నడక నీవంటు
అందులోన ఎంతైన దాగుంది
పరమాత్మ, పరమావధి, అందుంది.
సర్వం శక్తిలోన మహిమే
అణువంతకానొస్తే-
మహా మనిషైతేనే;
ఆ శక్తిని సమాజానికివ్వాలి
సమాజం మార్పుకు-
శ్రమనెంతైన మోయాలి.
మీలో వున్నది ఎంతైన
అది నిలుపుకో, మంటుంది దైవం
అదియే పరమావది శక్తుంది
మీకు తోడుగ దైవముంటుంది.

... కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు
సెల్ నెం: 9290839512

# పంచాంగం

మాసం : మార్గశిర; తిథి : ఏకాదశి రా.తె.4.00; అశ్విని రా.1.51; రా.వ.9.42ల 11.21.

మంగళవారం 18-12-2018

**మేషం** : ధనం ఏమాత్రం నిలబెట్టలేక పోయినా ఆర్థిక ఇబ్బంది అంటూ ఏదీ ఉండదు. పాత వస్తువులను కొని ఇబ్బందులను ఎదుర్కొంటారు. ట్రాన్స్‌పోర్టు, ట్రావెలింగ్ రంగాల వారికి కలిసిరాగలదు. దూర ప్రాంతాలకే చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. **వృషభం** : కొంతమంది సూటిపోటి మాటలు పడ టం వల్ల మానసిక ఆందోళనకు గురవుతారు.సాంస్కృతిక, సేవా కార్య క్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తారు. అకాల భోజనం, ప్రశాంతత లోపం వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు పనివారలతో సమస్యలు తలెత్తుతాయి. రిజిస్ట్రేషన్లకు ఇది అనువైన సమయం కాదు. **మిథునం** : మీరు చేసే పను లకు బంధువుల నుంచి విమర్శలు, వ్యతిరేకత ఎదుర్కొనక తప్పదు. ముఖ్యు లకు బహుమతులను అందజేస్తారు. రాబోయే కాలంలో ఖర్చులు, అవసరాలు మరింత పెరిగేందుకు ఆస్కారం ఉంది. నిరుద్యో గులకు ఉపాధి పథకాలు సంతృప్తికరంగా సాగుతాయి. వాగ్వివాదాలకు దూరంగా ఉండటం మచిది. **కర్కాటకం** : ప్రముఖులను కలుసుకుని బహుమతులను అందజేస్తారు. మధ్య వర్తిత్వం వహించుట వల్ల ఇబ్బందులను ఎదుర్కొంటారు. మీలోని శక్తి సామ ర్థ్యాలు ద్విగుణీకృతమయ్యే అవకాశం దక్కుతుంది. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు లభిస్తుంది. వృత్తి, ఉద్యోగాలలో వారికి ఆదాయం సంతృప్తి కరంగా ఉంటుంది. ధన లబ్ధి పొందుతారు. **సింహం** : ప్రైవేటు సంస్థలలోని వారికి ప్రతి విషయంలోనూ ఓర్పు , లౌక్యం అవసరం. మీ అభిరుచులకు తగిన వ్యక్తులతో పరిచయాలు పెంచుకుంటారు. విదేశాలకు వెళ్లడానికి చేయు యత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు పనివారితో చికాకులు ఎదురవుతాయి. ఉద్యో గస్తుల హోదా పెరగడంతో పాటు... బరువు బాధ్యతలు అధికమవుతాయి. **కన్య** :ప్రభుత్వ కార్యక్రమాలలోని పనులు అను కూలిస్తాయి. **తుల** : ఇప్పటివరకు విరోధులుగా ఉన్న వ్యక్తలను సుముఖం చేసుకోగలుగుతారు. ప్రేమికులు పెద్దల ఆగ్రహావేశాలకు గురికావలసి వస్తుంది. వాహన చోదకులకు ఆటంకాలు తప్పవు. బంధు మిత్రులతో మనస్పర్థలు తలెత్తు తాయి. చేతి వృత్తి వ్యాపారులకు లాభదాయకం.

# సన్మార్గమే నిర్దేశం కావాలి



**నిర్దేశం** అనే పదానికి చూపించు, ఆజ్ఞాపించు, సూచించు అని అర్థాలున్నాయి. నిర్దేశకుడు అంటే ఆజ్ఞాపించువాడు, చూపించువాడని అర్థం. దేనిని చూపాలి? ఏం ఆజ్ఞాపించాలి..? అనేవి ఆయా వ్యక్తుల వ్యక్తిత్వాన్ని నిర్దేశిస్తుంది. గీతలో అర్జును డికి మార్గోపదేశం చేయడంతో పాటు తానే మార్గ నిర్దేశం అయ్యాడు కృష్ణ భగవానుడు. ఈ జగత్తులో ప్రతి మానవుడు తాను జీవించే విధానం లేదా కర్మల ద్వారా సమాజాన్ని ప్రేరేపిస్తుం టాడు. కొందరు రచనల ద్వారా, మరికొందరు కళల ద్వారా, ఇంకొందరు వృత్తిద్వారా మార్గనిర్దేశం చేస్తూనే ఉన్నారు. ప్రకృతిలోని ఇతర జీవరాశులు సైతం తమదైన శైలిలో మార్గనిర్దేశం చేస్తుంటాయి.

సత్యయుగంలో మానవులు షోడష కళలతో సర్వ శ్రేష్టంగా జీవించేలా దేవతలు మార్గనిర్దేశం చేశారు. త్రేతాయుగంలో సైతం మానవులు గౌరవం, సోదరభావంతో మెలుగుతూ సామాజిక విలువలను ఉన్నతపథంలో నిలిపారు. ద్వాపర యుగంలో భక్తిమార్గం సమాజానికి సరైన దిశా నిర్దేశం చేసింది. రుషులు, మునులు, తపోధ నులు.. పరమాత్ముడి గుణగణాలను తెలియజేస్తూ ఎన్నో కావ్యాలను వెలువరించారు. ధర్మగ్రంథాలుగా ప్రాచుర్యం పొందిన ఈ కావ్యాలు నేటికి సామాన్య మానవులకు సైతం మార్గ నిర్దేశం చేస్తున్నాయి.

సాంఘిక జీవనంలో భాగంగా ఉన్న మనం.. ఆ సమాజానికి కీడు తలచడం సరికాదు. ప్రాణికోటి శుభం కోరే పరమాత్ముడి సంతానంగా ఉన్న మనం.. అశుభం కోరడం సమంజసం కాదు. ఎన్ని కష్టాలు ఉన్నా.. మనసా, వాచా, కర్మణా మంచినే కోరాలి. పరమ శివుడు నిర్దేశించిన శ్రీమతం ద్వారా సర్వ సమాజానికి అంతా మంచే జరుగుతుంది. మానవ జీవితంలో ఎదురయ్యే సమస్యలు యుద్ధంలాంటివైతే.. వాటిని ఎలా గెలువగలమో నిర్దేశిస్తూ మరొకరికి మార్గదర్శనం చేయాలి. పలాయనవాదులను చరిత్ర అసమర్థులుగా తేల్చి చెప్పింది. కష్టనష్టాలకోర్చి ముందుకు సాగేవాడే సమర్థుడు. అందుకే స్వామి వికేకానందుడు సమర్థవంతులైన కొందరి జీవితమే చరిత్ర అని వ్యాఖ్యానించారు. బీదవాడుగా జన్మించడం తప్పుకాదు. పేదవాడిగా మరణించడమే తప్పు అంటూ ఓ కవి నిర్దేశించారు. దీన్ని సార్థకం చేసుకున్నవారే సమర్థులు. అలాగని ప్రతి ఒక్కరూ ధనవంతులై పోవాలని కాదు. స్వయంకృషితో ఎదగాలని కవి భావం. ప్రతి వ్యక్తీ తన కుటుంబ పోషణకు సరిపడా ధనం ధర్మమార్గంలో సంపాదించాలి. కాని, అవసరాల కోసం పక్కవాడి పొట్ట కొట్టకూడదు. మాయమాటలు చెప్పి సాయం పొందడం అనైతికం. బీదరికం అనేది జీవిత సామర్థ్యం నిరూపించుకోవడానికి అందిన వరంగా భావించాలి. అందుకు తగ్గట్టుగా ధర్మబద్ధమైన మార్గాన్ని నిర్దేశించుకోవాలి. ఈశ్వరీయ జ్ఞాన యోగాల సంపదను సముపార్జించ కుండా శరీరం వదలడం అంటే మీ జీవనయానం సరైన దిశలో సాగలేదనే అర్థం.

వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు ఏది మంచి, ఏది చెడు తెలియజేస్తూ మనుష్యులను ముందుకు నడిపిస్తు న్నాయి. ఆదికాలం నాటి మానవ జీవన విధానం వేదాలలో అక్షర రూపమైందా..? వేదాక్షర రూపాన్ని మానవులు పాత్రగా పోషించి ఇతిహాసం అని అంటున్నారా..? అనేది అసలు ప్రశ్న. అయితే ఈ రెండూ ఒకే చక్రంలో తిరుగుతున్నాయి. ఇందులో ఏది ముందు, ఏది తర్వాత అన్న భేదం లేదు. ఈ రెండూ మనుష్య జాతిని సరైన మార్గంలో నడిపిం చడానికి పరమాత్ముడు సృష్టించిన అద్భుతమైన శక్తులే.

## సంకీర్తన



రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2560004

# సామాజిక మార్పునకు కందుకూరి కృషి

## వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు


సదస్సు సంచికను ఆవిష్కరిస్తున్న వీసీ నాగేశ్వర రావు

ఆంధ్రాయూనివర్శిటీ : సామాజిక మార్పుకు కందుకూరి వీరేశలింగం విశేష కృషిచేసారని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. ఏయూతెలుగు శాఖలో కందుకూరి వీరేశలింగం రచనలు- సమాలోచన అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కందుకూరి ఆదర్శప్రాయుడన్నారు. రచయితగా, కవిగా, సంస్కర్తగా విభిన్న బాధ్యతలను సమర్ధవంతంగా ఆయన నిర్వర్తించారారన్నారు. ఆయనను స్మరిస్తూ విభాగంలో సదస్సు ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు.

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.రామ మోహన రావు మాట్లాడుతూ స్త్రీలకు సమాజంలో భాగస్వాములను చేయడానికి అవసరమైన ఉద్యమానికి అధ్యుల్లో ఒకరిగా కందుకూరి వీరేశలింగం ఒకరన్నారు. స్త్రీ విద్య, పునర్వివాహం కోసం ఆయన చేసిన కృషి నిరుపమానమన్నారు. సాహిత్యంలో అడుగిడి, స్త్రీల సమస్యలను సమన్వయం చేస్తూ సాహితీ రచనలు జరిపారన్నారు. విభాగంలో గురజాడ, కందూకూరి పేరుతో సాహితీ సదస్సులు నిర్వహించడం పట్ల విభాగ ఆచార్యులను అభినందించారు. విభాగ ఆచార్యులు ఆచార్య జి.యోహాన్ బాబు సభకు అద్యక్షత వహించారు. సదస్సు ప్రాధాన్యతను, విశిష్టతలను వివరించారు. విభాగాధిపతి ఆచార్య జర్ర అప్పారావు మాట్లాడుతూ సాహిత్యం, సమాజాన్ని సమాన ప్రాధన్యత ఇస్తూ రచనలు జరిపిన గురజాడ, కందుకూరిలపై సదస్సులను విభాగంలో నిర్వహించడం జరిగిందన్నారు. తెలుగు శాఖ పునరుజ్జీవనం చేసే దిశగా అధికారులు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుమ్మ సాంబశివరావు, శరత్ జ్యోత్స్న రాణి, పరవస్తు సూరి, వెలమల సిమ్మన్న తది తరులు ప్రసంగించారు. సదస్సులో భాగంగా సదస్సు ప్రత్యేక సంచికను, ఆంధ్ర సాహితి త్రైమాసిక సంచికలను వీసీ ఆవిష్కరించారు.

# ఫిర్యాదులపై తక్షణ స్పందన

## ఎడిషనల్ ఎస్పీ నరసింహారావు



విజయనగరం : జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి 10 ఫిర్యాదులు రాగా జిల్లా అదనపు ఎస్పీ ఎం.నరసింహారావు సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కార దిశగా కృషి చేశారు. బొండపల్లి మండలంలో బి.కాంతమ్మ తనపై భౌతికదాడికి పాల్పడినట్లు గ్రామానికి చెందిన కొందరిపై ఫిర్యాదు చేసింది. నెల్లిమర్లలో బొప్పడాం గ్రామ నివాసి ఎస్.రమణమ్మ తన స్థలంలో ఉన్న ఇల్లును తొలగించి ఇజ్జాడ శివ దౌర్జాన్యానికి పాల్పడ్డాడని ఫిర్యాదుల పేర్కొంది. విజయనగరంలో సిహెచ్ శాంకుమారి తను 2.50లక్షలు రుణమిచ్చాననిరుణగ్రహీత పూర్తిగా చెల్లించలేదని ఫిర్యాదు చేసింది. పార్వతీపురానికి చెందిన బి.ధనలక్ష్మి తనను అదనపు కట్నం కోసం అత్త, మామ వేధిస్తున్నారని ఫిర్యాదు చేసింది. పై ఫిర్యాదులను పరిశీలించి పరిష్కా రానికై సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సి.ఐ జి.రామకృష్ణ కూడా పాల్గొన్నారు.

## నీటి చౌర్యానికి పాల్పడిన

# 74 మోటార్లు సీజ్

## మున్సిపల్ కమిషనర్ టి.వేణుగోపాల్

విజయనగరం : మున్సిపల్ కొళాయిలకు మోటార్లు ఏర్పాటుచేసి నీటిచౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ టి.వేణుగోపాల్ అన్నారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు నీటిచౌర్యానికి పాల్పడుతున్నవారి 74 మోటార్లను సీజ్‌చేయడం జరిగిందన్నారు. సదరు మోటార్లును పురపాలక స్టోర్‌లో భద్రపరచడం జరిగిందన్నారు. నీటిచౌర్యానికి పాల్పడుతున్నవారి వివరాలను కౌన్సిల్ దృష్టికి తీసుకునివెళ్లి, కౌన్సిల్ ఆమోదం మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీరోజు వార్డుల్లో తనిఖీలు నిర్వహించి మోటార్లు సీజ్ ప్రక్రియను కొనసాగిస్తామన్నారు.

## ఘనంగా

# యునైటెడ్ క్రిస్మస్ వేడుకలు



భీమునిపట్నం : స్థానిక గంటా క్యాంపు కార్యాలయంలో ఎఎంసి అధ్యక్షులు కె.ఎస్.ఎం సుధాకర్ ఆధ్వర్యంలో యునైటెడ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భీమిలి నియోజకవర్గ ప్రతినిధి సి.హెచ్. విజయ్ బాబు,మాజీ మంత్రి ఆర్.ఎస్.డి.పి అప్పలనరసింహరాజు లు హాజరయ్యారు. ముందుగా కేక్ కట్ చేసారు. తరువాత ప్రార్థనలు చేశారు.ఈ కార్యక్రమంలో భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటా నూక రాజు, వివిధ చర్చ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఆర్‌సి సంచాలకునిగా పుల్లారావు బాధ్యత స్వీకరణ

## అభినందించిన ఆచార్యులు


ఆచార్య పుల్లారావును అభినందిస్తున్న ఆచార్యులు

ఆంధ్రాయూనివర్శిటీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆగ్రో ఎకనామిక్ రీసెర్చ్ సెంటర్ (ఏఆర్‌సి) సంచాలకునిగా ఏయూ అర్ధశాస్త్ర విభాగాధిపతి ఆచార్య డి.పుల్లారావు పదవీ బాధ్యతలు స్వీకరించారు.

ఆయన కార్యాలంలో సంచాలకునిగా బాధ్య తలు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆచార్య పుల్లారావును పలువురు అభినందించారు.

# తుఫానుపై అంతా అప్రమత్తం : కలెక్టర్ హరిజవహర్‌లాల్



విజయనగరం : జిల్లాలో మెంచెత్తుతున్న తుఫాన్‌ను ఎదుర్కునేందుకు అప్రమత్తంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ డా.ఎం.హరి జవహర్‌లాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మండల, గ్రామస్థాయి అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. జిల్లాస్థాయి అధికారులందరూ విధిగా మండలాల్లో ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. మండలస్థాయి అధికారులు గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి నష్టం జరగకుండా చూడాలన్నారు. ఆస్తి నష్టం, పశు, ప్రాణ నష్టాలు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. వర్షాలు ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో కాలువలు శుభ్రపర్చి నీటిని చెరువుల్లోకి తరలిం చాలన్నారు. మున్సిపల్ అధికారులు ప్రజల ఇబ్బందులు గమనిం చాలని ఆదేశించారు. ఆహారం, పారిశుధ్యం, వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. శిథిలావస్థల్లో, గుడెశల్లో ఉన్న వారిని పక్కా భవనాలకు తరలించాలని తెలిపారు. పిహెచ్‌సిల్లో మందులు, వైద్యాధికారులు సిద్ధంగా ఉండాలని, భోగాపురం మండలంలో 17 పునరావాస కేంద్రాల్లో ఆహారం, మంచినీరు, విధ్యుత్, వైద్య సదుపాయాలు కల్పించే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. నష్టం వాటిల్లగానే తక్షణమే కంట్రోల్ రూమ్‌కు తెలపాలన్నారు. పార్వతీపురం, కురపాం నియోజకవర్గాల్లో ఐటిడిఎ పిఓ,సబ్‌కలెక్టర్, విజయనగరం నెల్లిమర్ల, చీపురుపల్లి నియోజక వర్గాల్లో సంయుక్త కలెక్టర్, ఎస్.కోట, సాలూరుల్లో సంయుక్త కలెక్టర్-2, జిల్లా కంట్రోల్ రూమ్‌లో డిఆర్‌ఓ పర్యవేక్షించాలన్నారు. ఈ టెలికాన్ఫ రెన్సులో డిఆర్‌ఓ వెంకటరావు పాల్గొన్నారు.

# సముద్రంలో అలలు తాకిడి



భీమునిపట్నం : ఫెథాయ్ తుఫాన్ ప్రభావంతో భీమిలి సముద్రం లో కెరటాలు సోమవారం ఉదయం నుండి ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి. మధ్యాహ్నం నుంచి బలమైన గాలులు విపరీతంగా వీస్తున్నాయి. అధికార యంత్రాంగం అప్రమత్తమై లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు. మండలం లో భీమిలి తోటవీధి లో, మున్సిపల్ స్కూల్ లో తగరపువలస 8వ వార్డు, మూలకుద్దు లో కెతరిన్ స్కూల్‌లలో పునరావాస కేంద్రా లను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. చిట్టివలస క్వార్టర్స్ లో ఉన్న శిధిలావస్థలో ఉన్న ఇళ్ళను ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు తరలివెళ్ళాలనీ కమీషనర్ ముందస్తు గా చెప్పడంతో ఆయా నివాసితులు శిధిలావస్థలో ఉన్న ఇళ్ళను ఖాళీ చేసి పునరా వాస కేంద్రాలకు తరలించారు. అధికార యంత్రాంగం ఎప్పటి కప్పుడు సమాచారం తెలియపరు స్తున్నారు అదే విధంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ను ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ పి.వి.ఎల్ గంగాధరరావు జోనల్ కమీషనర్ పి.దుర్గా ప్రసాద్‌లు తెలిపారు.

## పేదవాని సొంతింటి కలను నెరవేర్చడమే

# ప్రభుత్వ ధ్యేయం

విజయనగరం : ప్రతీ పేదవాని సొంతింటి కలను నెరవేర్చాలనే సంకల్పంతో రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే మీసాల గీత, మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ అన్నారు. అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా నిర్మించిన కోడి రామ్మూర్తి గృహసముదాయంలో 1239 మంది లబ్ధిదారులకు ఆన్‌లైన్ ద్వారా ప్లాట్ల కేటాయింపు జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీసాల గీత మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలోనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతాయన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పూల్‌భాగ్ కాలనీ, బిసి కాలనీ తదితర ప్రాంతాల్లో నిర్మించిన గృహాలు నేటికీ నాణ్యతతో ఉన్నాయన్నారు. ప్రముఖులను గౌరవించాలనే ఉద్దేశ్యంతో సోనియా నగర్ ప్రాంతంలో నిర్మించిన గృహసముదాయానికి కోడి రామ్మూర్తి గృహ సముదాయంగా నామకరణం చేయడం జరిగిందన్నారు.

అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. సారిపల్లి, కోడిరామ్మూర్తి సముదాయాల్లో ఇళ్లుపొందిన ప్రతీ లబ్ధిదారుడు 3 లక్షల వరకు సబ్సిడీ పొందడం జరిగిందన్నారు. పేద ప్రజల కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రజలందరూ సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసాధ్యాలను సుసాధ్యం చేస్తూ ప్రతీ పేదవానికి అనేక సంక్షేమ ఫలాలను అందజేస్తున్నారన్నారు. పుట్టిన బిడ్డ నుండి వృద్ధుల వరకు అందరికీ ఏదో రూపంలో ప్రభుత్వం సహాయం అందజేస్తోందన్నారు. సారిపల్లి, కోడిరామ్మూర్తి గృహసముదాయాల్లో అన్ని మౌళిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక, ప్లాట్ల కేటాయింపు జరిగిందన్నారు.

ఇప్పటివరకు ఐదువేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వారికి కూడా త్వరలోనే గృహాలను మంజూరు చేయడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ టి.వేణుగోపాల్ మాట్లాడుతూ పేదింటి సొంతకలను నిజం చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అత్యంత నాణ్యతాప్రమాణాలతో గృహనిర్మాణాలు జరుగుతున్నాయన్నారు.

అందరికి ఇళ్లు పథకంలో లబ్ధిదారులందరికీ పారదర్శకంగా మంజూరు, ప్లాట్ల కేటాయింపు జరిగిందన్నారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలకు అవకాశం లేదన్నారు. అంతా ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారానే జరిగిందన్నారు. అలాగే విభిన్న ప్రతిభా వంతులకు, 60 సంవత్సరాలు దాటిన లబ్ధిదారులకు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ప్లాట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. లబ్ధిదారు లందరూ తాము చెల్లించవలసిన మొత్తాన్ని పూర్తిస్థాయిలో చెల్లించిన తరువాత బ్యాంకు లోను ప్రక్రియ ప్రారంభమవు తుం దని, అనంతరం గృహాలను అప్పగించడం జరుగు తుందన్నారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కనకమహాలక్ష్మి, టిడ్కో ఇఇ శ్రీనివాస్, డిఇ శ్రీరామ్మూర్తి, టిడ్కో ప్రతినిధి శ్రీదేవి, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భీమిలి జోన్ 19వ వార్డులో

# బూత్ కన్వీనర్ల సమావేశం



భీమునిపట్నం : భీమిలి జోన్ 19వ వార్డులో బూత్ కన్వినర్ల సమావేశం పట్టణ వై.సి.పి. ప్రధాన కార్యదర్శి అల్లిపిల్లినర్సింగరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లి ఎన్నికల దగ్గర పడుతున్న తరుణంలో ప్రతీ కార్యకర్త ఎంతో బాధ్యతగా పనిచేయాలని కోరారు ప్రస్తుత పరిస్తి తులలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరాలంటే జగన్ మోహన్ రెడ్డి సి.ఎం కావాలని అన్నారు. మీ ప్రాంతాలలో ఓటర్ జాబితాలను సరి చూసుకోవాలని అన్నారు. 19వ వార్డు అధ్యక్షులుగా వాడమొదుల జగ్గారావు.బూత్ కన్వినర్ కదిరి కాశీరామ్ ,బూత్ సభ్యులు గా కాసరపు అశోక్ కుమార్ .కట్టమూరి వెంకన్నబాబు. కాసరపు ఆనంద్. కాసరపు ఎల్లాజీ.కాసరపు నూకరాజు. కదిరి గురన్న. చింతపల్లి సత్యారావు. పిల్లా సతీష్.వాడమొదుల సతీష్. చింతపల్లి పైడిరాజు లను నియమించారు.

ఈ కార్య క్రమంలో ప్రధాన కార్యదర్శి జీరు వెంకటరెడ్డి. బీ.సి సెల్ అధ్యక్ష్యులు వాసుపల్లి కోండబాబు. యువజన అధ్యక్ష్యులు బింగి కిరణ్ రెడ్డి.వా.జ సెల్ అధ్యక్ష్యులు పందిరి విజయ్.సేవాదల్ అధ్యక్ష్యులు మారుపల్లి రాము.జిల్లా కార్యదర్శి కాసరపు పెద్ద ఎల్లాజీ.గణేష్ రెడ్డి.మరియు వై.సి.పి కార్యకర్తలు పాల్గొన్నారు.

# పింఛనుదారుల సమస్యలపై సానుకూలత ఉండాలి

## వైయస్సార్ నేత మజ్జి శ్రీనివాసరావు



విజయనగరం : ప్రభుత్వ ఉద్యోగులుగా 30ఏళ్ళ పైబడి ప్రజలకు సేవలందించి పదవీ విరమణ చేసిన అనంతరం పెన్సనర్లుగా ఉంటూ జీవిత చరమాంకంలో ఉన్న వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించే బాధ్యత ప్రభుత్వంపై ఉందని జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయవ్యవహారాల సమన్వయకర్త మజ్జి శ్రీనివాస రావు(చినశ్రీను) పేర్కొ న్నారు.అఖిలభారత ఫించనుదార్ల దినోత్సవ వేడుకలు సందర్భంగా సోమవారం స్థానిక ఫించనుదారుల అసోషియేషన్ భవన ప్రాంగణంలో సంఘ జిల్లా అధ్యక్షులు పెద్దింటి అప్పారావు అధ్యక్షతన జరిగిన సభలో మజ్జి శ్రీనివాసరావు(చినశ్రీను) ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డా॥ వై.యస్. రాజశేఖరరెడ్డి పించనుదారుల సమస్యలు పరిష్కారానికి ఎంతో కృషి చేసారని , అలాగే వారి సంక్షేమం కోసం పలు హామీలు ఇచ్చారని శ్రీనివాసరావు ఈ సందర్భంగా గుర్తు చేసారు. డా॥ వై.యస్.తనయుడు, వైసిపి అధినేత జగన్ మోహన్‌రెడ్డికి మీ సమస్యలు పట్ల సానుకూల ధోరణితో ఉన్నారని అన్నారు. ఫించనుదారుల సంఘం నాయకులు తనతో వస్తే శ్రీకాకుళం జిల్లా పాదయాత్రలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి సమస్యలు వివరించి, వాటి పరిష్కారానికి ప్రయత్నిద్ధామని శ్రీనివాసరావు అన్నారు. పించనుదారులకు ఎల్లవేలలా తాను అందుబాటులో ఉంటూ మీ యొక్క కార్యక్రమాలకు నా సహకారం ఉంటు ందని ఆయన హామీ ఇచ్చారు. అదే విధంగా పిల్లలు వయోవృద్ధులయిన తమ తల్లి, దండ్రులను కంటికి రెప్పలా చూసుకుంటూ గౌరవించాలని ఆయన సూచించారు. సభలో ఎన్.జీ.ఓ.నాయకులు ప్రభూజీ, సంఘప్రధాన కార్యదర్శి నారాయణరావు, డా॥ బి.యస్.ఆర్.మూర్తి, కోలగట్ల వెంకట కృష్ణారావు, డి.వి. రమణ, ఆర్.వి.రమణమూర్తి, సాయిరాం తదితరులు పాల్గొని ప్రసంగించారు.

కో-ప్రొడ్యూసర్స్ కావలెను
త్వరలో మేము ప్రతిష్టాత్మకంగా నిర్మించబోవు మల్టీస్టార్ చిత్రానికి సహాయ నిర్మాతలు కావలెను
95532 45023
95819 91533

2019 డైరీలు, క్యాలెండర్లు హోల్‌సేల్
భారతీయ స్టేషనరీ & బుక్ సెంటర్
పూర్ణామార్కెట్ కార్ పార్కింగ్ ఎదురుగా
విశాఖపట్నం 530001
98499 92338, 2561749,

# యానాం – కాకినాడ మధ్య తీరం దాటిన పెథాయ్ తుఫాను

## ముప్పు ప్రాంతాలలో మంత్రి మల్లాడి పర్యటన



యానాం: బంగాళా ఖాతంలో ఏర్పడిన పథాయ్ తుఫాను యానాం కాకినాడల మధ్య 12 గంటల 15 నిముషాలకు తీరం దాటింది. గంటకు 80 కీమీటర్ల వేగంతో ఈదురు గాలులు, భారీ వర్షాలు కురవడంతొ యానాంలో అన్ని రోడ్డు మార్గాలు మోకాలు లోతు నిండిపోయాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు గత రెండు రోజులగా తుఫాను ప్రభావం వలన ప్రజలు అప్రమత్తంగా మెలగాలని అన్ని గ్రామాలు తిరిగి చెప్పడంతో ప్రజలు ఎవరూ బయటకు రాకపోవడం, సముద్రంలోకి మత్స్యకారులు వేటకు వెళ్లకపోవడంతో పెనుప్రమాదాలు తప్పాయి. భారీ వర్షాలు ఈదురుగాలులు వీస్తున్నప్పటికీ మంత్రి మల్లాడి, పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావుల పర్యవేక్షణలో అన్ని గ్రామాలలోను ఉదయం 8 గంటల సమయంలో ప్రజలందరికీ అల్పాహారం అందచేశారు. స్థాయినిక సెంటర్ల కిచెన్‌ద్వారా భోజన సదుపాయాలు ఆయా గ్రామాలకు తరలించి అందచేశారు. విషయం తెలుసుకున్న పుదుచ్చేరి కలెక్టర్ అబిజిత్ విజయ్ చౌదరి, రెవెన్యూ సెక్రటరీ దేవేసింగ్‌లు తీర ప్రాంతాలైన సావిత్రినగర్, గిరియంపేట, దరియాలతిప్ప, పలు ముప్పుప్రాంతాలలో పర్యటించి పరిశీలించారు.

అనంతరం పరిపాలనాధికారి కార్యాలయంలో మంత్రి మల్లాడి అధ్యక్షతన తుపాను నష్టంపై తీసుకోవలసిన అంశాలు ప్రభుత్వానికి నివేదించవలసిన అంశాలపై చర్చించారు. ఆయా ప్రాంతాలలోను జరగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వాని నివేదించారు. రానున్న 24 గంటలలొ భారీ వరాషలు పెనుగాలులు వీచే అవకాశం ఉందని ఆయా ప్రాంతాలలో చాటింపు వేయించారు.

# వర్షం పడుతున్నా ఆగని దీక్షలు



టి. వెంకుపాలెం: భూసేకరణలో భాగంగా తమకు నష్టపరిహారం ఇప్పించేందుకు మాజీ సర్పంచ్ నంబారు శ్రీను రైతుల నుంచి 50% వాటా అడగడమే కాకుండా దాని నిమిత్తం తమ వద్ద నుంచి ప్రాంసరీ నోట్లు కూడా తీసుకున్నారని ఆ గ్రామానికి చెందిన రైతులు పలువురు ఆరోపించారు. దీక్షల్లో ఆరవ రోజైన సోమవారం వర్షంలో కూడా దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మీడియాతో మాట్లాడుతూ లబ్ధిదారులు జాబితాలో ఎలాంటి అవకతవకలు జరగలేదని చెబుతున్న మాజీ సర్పంచ్ దానిపై దమ్ముంటే బహిరంగ విచారణకు రావాలని సవాల్ విసిరారు. కేవలం అతని కుటుంబ సభ్యులు పేర్ల మీద 25 ఎకరాల భూమిని నమోదు చేశాడన్నారు. కొద్ది రోజుల క్రితం వరకు పరిహారం రాదని చెప్పి నిన్న రైతులతో సమావేశం ఏర్పాటు చేసి పరిహారం కోసం పోరాడుతామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నంబారు శ్రీను చేసిన అవినీతికి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని తెలిపారు. దీక్షలకు నేతృత్వం వహించిన జనసేన నాయకులు కొణతాల సీతారాం మాట్లాడుతూ అర్హులైన రైతులకు పరిహారం చెల్లించాలని మొదటి నుంచి పోరాడుతున్నది జనసేన పార్టీ అని చెప్పారు. బాధ్యత గల పదవి అనుభవించి ఓటేసి గెలిపించిన ప్రజలకు అన్యాయం చేయాలనుకోవడం దారుణమన్నారు. రైతులందరికీ న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని ఆయన చెప్పారు.

ఈ కార్యక్రమంలో రైతులు కుండల లోవరాజు, ఉరుకూటి సింహాద్రి, ఉరుకూటి లోవరాజు, ఉరుకూటి సత్యారావు, భరణికాన మాణిక్యం, భరణికాన అప్పలరాజు, భరణికాన అచ్చయ్య నాయుడు, సదరాన అప్పారావు, పాము గోవిందు, పాము రమణ బాబు, కుండల గంగ అప్పారావు, ఉరుకూటి చిన్నమ్మలు, ఉరుకూటి రమణమ్మ, ఉరుకూటి అప్పలనర్స పాల్గొన్నారు.

# తుఫాను సహాయం కోరితే ఇస్తా ఓన్‌జిసి జిఎం

యానాం: పెథాయ్ తుఫాను ప్రభావంవలన కురిసిన భారీ వర్షాలకు పెనుగాలులకు ఓఎన్‌జిసి సంస్థ తరుపున సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని కాకినాడ ఓఎన్‌జిసి హెచ్‌ఆర్ జిసి కె. ఆర్మోఖం, పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మాల్లాడికి, పరిపాలనాధికారికి విజ్ఞప్తిచేశారు. సోమవారం ఉదయం తుపాను ప్రభావిత ప్రాంతాలలో ఆయన సందర్శించి సందర్భంగా మంత్రి మల్లాడిని పరిపాలనాధికారిని కలిసి యానాం ప్రజలకు ఓఎన్‌జిసి తరపున సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని అత్యవసర పరిస్థితి కింది ప్రజలకు నిత్యావసర వస్తువులు, మందులు ఎటువంటి సహాయం అయినా అందిస్తామని ఆయన చెప్పారు. దీనికి మంత్రి మల్లాడి ప్రభుత్వ పరంగా సహాయం అందుతుందని తుపాను ప్రభావం దాటిన తరువాత సహాయం కోరుతామని ఆయన స్పష్టంచేశారు. యానాంలోని అన్ని రోడ్లు జలమయం కావడంతో డ్రైనేజ్‌లు పరిశుభ్రం చేయడానికి కావలసి యంత్ర సామగ్రాని సమకూరుస్తామని ఈ సందర్భంగా విజ్ఞప్తిచేశారు.

## నిత్య అన్నదాన పథకానికి రూ.1,00,00/- విరాళం



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో ఎంతో ప్రతిష్టాత్మకముగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన జెట్టి.శివసత్యకుమార్ రూ.లక్ష విరాళమును దేవస్థానం ఈవో ఎమ్.జితేంద్రకు అందజేసి ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో డిశంబరు16న శివసత్యకుమార్, అంబికా దంపతుల పేరున అన్నదానం జరిపించవలెనని కోరారు.

## సముద్ర తీవ్రతకు నీట మునిగిన గ్రామాలు

కొత్తపల్లి : కొత్తపల్లి మండలం సముద్రం తీరం వెంబడి ఉన్న గ్రామాలు సోమవారం భారీ గాలులతో కూడిన వర్షం సముద్రం భారీ స్థాయిలో ఎగసిపడటంతో కెరటాలు తీర్రపాంతంలో ఉన్న గ్రామాలు నీట మునిగాయి ఫెథాయ్ తుపాను ప్రభావంతో తీర్రపాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి సహాయక చర్యలు అందిస్తున్నారు బాధిత ప్రజలకు తినుబండారాలను చిన్నపిల్లకి పాలన అందజేస్తున్నారు మండలంలో కోనపాపపేట మాయాపట్నం అమ్మినా బాదు సుబ్బంపేట సోనాల్ పేట పల్లిపేట గ్రామాలు నీటమునిగాయి పోలీస్ వారు రెవిన్యూ మండలాధికారులు అలాగే అదనపు అధికారులు వైద్యులు సురక్షిత ప్రాంతాల్లో క్యాంపులు పెట్టి సహాయక చర్యలు అందజేస్తున్నారు పిఠాపురం ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఎప్పటికప్పుడు క్యాంపులకు చేరుకుని సమీక్షను అడిగి తెలుసుకుంటున్నారు తుపాను తీరం దాటే సమయంలో భారీ నుండి అతి భారీ ఎదురు గాలులు వీయడంతో ఇళ్ల నుండి ప్రజలు బయటకు రావద్దని అధికారులు చెబుతున్నారు.

## అయ్యన్నపై ఆరోపణలు చేయడం తగదు



గొలుగొండ : మంత్రి అయ్యన్నపై వైసిపి నాయకులు అసత్య ఆరోపణలు చేయడం తగదని నర్సీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్, మండల టీడీపీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు అన్నారు. గొలుగొండలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సాలికమల్లవరం రంగురాళ్ల క్వారీలో అక్రమంగా జరిగిన తవ్వకాలలో మంత్రి అయ్యన్న హస్తం ఉందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రంగురాళ్ల తవ్వకాలును ప్రోత్సహించే దిగజారుడు స్థాయికి మంత్రి అయ్యన్న లేరన్నారు. తవ్వకాల కోసమే నాతవరం గొలుగొండ మండలాల లింక్ రోడ్డును ఏర్పాటు చేశారనే వైసిపి నాయకుల విమర్శలు అర్థరహితమన్నారు. మంత్రిపై చేసిన వ్యాఖ్యలు వెనక్కితీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిటికెల సాంబమూర్తి, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు సుర్ల బాబ్జీ పాల్గొన్నారు.

# రైతులను వణికిస్తున్న పెథాయ్ తుఫాన్



యలమంచిలిః బంగాళాఖాతంలో ఏర్పడ్డ తుఫాను తీవ్ర వాయుగుండంగా మారడంతో వీస్తున్న పెనుగాలులకు వరి కుప్పలు ధ్వంసమవుతున్నాయి. వరితో పాటు అరటి, బొప్పాయి, కొబ్బరి, వాణిజ్య పంటలకు కూడా నష్టం వాటిల్లింది.

ఈ ఏడాది వర్షాభావ ప్రభావంతో అధిక తెగుళ్లతో అరకొరగా పండిన వరి చేలు కోత దశలో ఈ తుఫాను మరింత నష్టం కలిగిస్తుంది. కోసిన వరి పనలు ఎండక మునుపే కుప్పలు వేసిన రైతులు ఈదురు గాలులకు కుప్పలు ధ్వంసం కావడంతో వరిపనలు తడిచి ముద్దవుతున్నాయి. పంటలు పెట్టుబడులు, కూలీలు దొరకక అధిక మొత్తం చెల్లించి పనులు చేయిస్తున్న చివరి దశలో ఈ తుఫాను రైతులను కంటనీరు పెట్టించింది.

## జగదాంబ సిపిఎం కార్యాలయంలో

# కామ్రేడ్ డి.శారద వర్ధంతి సభ




విశాఖపట్నం: శ్రామిక మహిళా నాయకురాలు, దీశాలి కామ్రేడ్ డి.శారద 13వ వర్ధంతి సభ జగదాంబ వద్ద గల సిపిఎం కార్యాలయంలో జరిగింది. ఈ సభ సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సినీయర్ నాయకులు గండి నాయనబాబు, జి.పోలేశ్వరరావులు పూలమాలవేసి నివాళిలర్పించారు. అనంతరం జి.పోలేశ్వరరావు మాట్లాడుతూ ఆదర్శ కమ్యూనిస్టు కుటుంబంలో పుట్టి, ఆఖరి శ్వాస వరకు ఆదర్శవంతమైన కమ్యూనిస్టుగా బ్రతికిన ధన్యజీవి కామ్రేడ్ డి.శారద. పార్టీ కోసం సర్వసం ధారబోసిన కామ్రేడ్ డి.వి సుబ్బారావు , కామ్రేడ్ బిక్షావతి దంపతుల కుమార్తె ఆమె. నాడు పుచ్చలపల్లి సుందరయ్య, కె.కె గోపాలన్ వంటి అగ్రనాయకులు అడుగుపెట్టిన వాకిలి వారిది. అయినా ఏనాడు హడావిడి లేకుండా జీవితాంతం పనిచేసిన కార్యకర్త శారద. అందుకే సాధారణ కార్యకర్త శాదర. ఎస్ఎఫ్ఐ, సిఐటియు, మహిళా సంఘం అభివృద్ధికావటానికి ఆమె అహర్నిశలు శ్రమించారు. ఆమెది అరుదైన వ్యక్తిత్వం, చెరగని చిరునవ్వు, ఆప్యాయమైన పలకరింపు ఆమెకు నిత్యాభరణాలు. పార్టీని కుటుంబంగా భావించడం, పార్టీ అభివృద్ధి కోసం పరితపించే వారు కామ్రేడ్ శారద. ఏ బాధ్యతనైనా నమ్మకంగా నిర్వహించేవారు. అందుకే శాదర మరణం స్నేహితులకు, కామ్రేడ్స్‌కి ఆమె లేని లోటు తీరనిది. ఆమె ఏ సాధన కోసం అయితే నిరంతరం పనిచేశారో ఆ యొక్క ఆశయ సాధనకు నిరంతరం కృషి చేయడమే ఆమెకు మనమిచ్చే ఘనమైన నివాళి.

ఈ వర్ధంతి సభ కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఎస్.అరుణ, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఎస్వి నాయుడు, సిఐటియు నాయకులు సూరీడు, సిపిఎం నాయకులు ఎ.రాజు, జగన్నాథం, దాసు తదితరులు పాల్గొన్నారు.

# యూజీడీ పనులకు శంకుస్థాపన



పెదవాల్తేరు: పెదజాలారిపేట కాలనీలో రూ. 35 కోట్ల వ్యయంతో భూగర్భ మురుగు నీటి వ్యవస్థ (యూజీడీ) పనులు జరుగుతాయని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తెలిపారు. ఇక్కడి ఎన్టీఆర్ విగ్రహం వద్ద యూజీడీ పనులకు ఆయన శంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ పనుల్లో భాగంగా కేటాయించిన నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర ఉపాధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి, జీవీఎంసీ ఈఈ శ్రీనివాస్, డీఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సత్యదేవుని సన్నిధిలో మెట్లోత్సవం



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం సత్యదేవుని సన్నిధిలో ఘనంగా మెట్ల పూజోత్సవం ఘనంగా జరిగింది ప్రతీ సంవత్సరం ధనుర్మాస ప్రారంభం తొలి రోజున సత్య దేవుని మెట్లోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం 7-30 ని.లకు స్వామి, అమ్మవార్లను పల్లకీలో ఉంచి కొండపై నుండి కొండ దిగువకు తీసుకొని వచ్చి అక్కడ నుండి గ్రామోత్సవం పూర్తి చేసుకొని అక్కడ నుండి సత్యదేవుని తొలిపావాంచ మెట్ల వద్ద దేవస్థానం ఈవో దంపతులు, పిఆర్వో దంపతులు, పాలకమండలి సభ్యులు కొత్త.కొండబాబుచే వేద పండితులు స్వామివారి పాదాలు చెంత పూజలు చేయించారు. అనంతరం ప్రతీ మెట్టుకు మహిళలు పసుపు రాసి కుంకుమబొట్లు పెట్టగా అర్చక స్వాములు పుష్పార్చన చేసి హారతులు వెలిగించి నైవేద్యము సమర్పించారు. మెట్లోత్సవ ఏర్పాట్లును ఆలయ సూపరింటెండెంట్ బలువు.సత్య శ్రీనివాస్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పోల్నాటి. లక్ష్మీ నారాయణ పర్యవేక్షణలో ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జన్మనిచ్చిన తల్లి భగవంతుని కంటే గొప్పది

## - చాగంటి కోటేశ్వరరావు



అనకాపల్లి: సృష్టిలో తల్లిని మించిన దైవం మరొకటి లేదని, జన్మనిచ్చిన తల్లిదండ్రులే దైవాలని, అద్యాత్మిక ప్రవచకులు చాగంటి కోటీశ్వరరావు అన్నారు. పట్టణంలో రావుగోపాలరావు కళాక్షేత్రంలో వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యంలో మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ, అతిధి దేవో భవ, అనే అద్యాత్మిక ప్రవచనాలపై చాగంటి కోటీశ్వరరావు అశేష జనవాహిని మద్య ప్రసంగించి పలువురు మన్ననలను పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మానవవనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు, స్థానిక శాసన సభ్యులు పీలా గోవిందసత్యనారాయణ, గజపతినగరం ఎమ్మెల్యే కె. నాయుడు, ముఖ్య అతిధులుగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం చాగంటి కోటీశ్వరావును ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేసారు. చాగంటి కోటీశ్వరరావు మాట్లాడుతూ ఈ సృష్టికి లయకర్తకులు భగవంతుడైతే ఈ సృష్టిలో ప్రతీ జీవికి జన్మనిచ్చినది తల్లేనని కొనియాడారు. కోటి తులసపూజలు చేసిన గుడులు, గోపురాలు తిరిగినా పుణ్యనదుల్లో స్నానం ఆచరించినా, నవమాసాలు మోసి కడుపులో ఉన్న బిడ్డకు ఆహారాన్ని ఇస్తూ జన్మనిచ్చిన తల్లే ఈసృష్టిలో భగవంతుడి కన్నా మిన్నా అని అన్నారు. తల్లి మరణచాయలవరకు కూడా తన బిడ్డ కీర్తి ప్రతిష్టలతో బ్రతకాలని ఆకాంక్షించేది ఆ తల్లి ప్రేమ మాత్రమేనని, అమ్మలాంటి త్యాగ మూర్తి ఈ లోకములో ఎవరూ ఉండరని, బిడ్డ ఎడుస్తుంటే వెయ్యిమంది తన చుట్టూ ఉన్నా కొంగు కప్పుకుని బిడ్డకు పాలు ఇచ్చి ఆకలి తీర్చే తల్లి ఎంత గొప్ప పుణ్యవతురాలో అని కొనియాడారు. ఎంత కీర్తి ప్రతిష్టలు, ధన దాన్యాలు బంధు మిత్రులు మన వెంట ఉన్నా, నవమాసాలు మోసి జన్మనిచ్చిన తల్లి రుణం తీర్చుకోవడానికి వచ్చే జన్మకూడా, చాలదేమోనని, బిడ్డపై తల్లికున్న మాతృప్రేమపై వేలాది సభకుల మద్య హర్షద్వానాలతో ఆయన ప్రసంగం కనులవిందుగా జరిగింది. వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కాంద్రేగుల విష్ణుమూర్తి, కార్యదర్సి డాక్టర్ కె. సత్యవతులు మాట్లాడుతూ ఇటువంటి మహోత్తర కార్యక్రమం జరగడం పట్టణ ప్రజలు అదృష్టమన్నారు. లోకంలో కనబడని, దైవం కన్నా కన్న పేగును తెంచుకుని జన్మనిచ్చిన అమ్మె ఈ లోకంలో సృష్టికర్త అని, చాగంటి ప్రవచనాలతో పట్టణ ప్రజలను అద్యాత్మికంగా మంత్రముగ్దుల్ని చేసిన, చాగంటి కోటీశ్వరావుకి అభినందనలని అని కొనియాడారు. తిరుమల తిరుపతి దేవస్దానం భక్త బృందం అన్నమాచార్య కీర్తనలతో పలువుర్ని ఆకట్టుకుంటుది. ఈ కార్యక్రమంలో నన్నయ్య విశ్వ విద్యాలయం ఉపకులపతి ముర్రు ముత్యాలనాయుడు, ముత్తంశెట్టి మహేష్, దేశం నాయకులు మళ్ల సురేంద్ర, బుద్ద నాగజగదీశ్వరావు, విల్లూరి పైడారావు, కెకెవి నారాయణరావు, పట్టణ వేద పండితులు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# ఇక రాహుల్ గాంధీ పెళ్లి చేసుకోవచ్చు!

## కేంద్రమంత్రి రామ్‌దాస్ అథవాలే ఎద్దేవా



న్యూఢిల్లీ: తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ విజయం సాధించి గద్దెనెక్కడంపై కేంద్ర మంత్రి, మహారాష్ట్రకు చెందిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధినేత రామ్‌దాస్ అథవాలే స్పందించారు. కాంగ్రెస్ సాధించిన విజయంతో ఇకపై రాహుల్ గాంధీ పప్పు కాదని, పప్పా (తండ్రి) అయ్యారని ఆయన వ్యాఖ్యానించారు. ఇక ఆయన పెళ్లి చేసుకొని పప్పా అవ్వొచ్చని ఎద్దేవా చేశారు. చాలా మంది రాహుల్‌ను పప్పు అని పిలుస్తుండడం తెలిసిందే. కాంగ్రెస్ విజయంతో ఆయన ఇప్పుడు పప్పాగా మారారు. నా సలహా ఏమిటంటే.. ఇక ఆయన త్వరగా పెళ్లి చేసుకొని నిజమైన పప్పా అవ్వొచ్చు. అని కేంద్ర మంత్రి రామ్‌దాస్ ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో భాజపా పరాజయం గురించి విశ్లేషిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

మూడు రాష్ట్రాల్లో భాజపా పరాజయానికి ప్రధాని మోదీ కారణం కానే కాదని, అందుకు రాష్ట్ర భాజపానే కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. డిసెంబరు 11న వెల్లడించిన ఎన్నికల ఫలితాల్లో 90 స్థానాలున్న ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ 68 సీట్లు గెల్చుకున్న సంగతి తెలిసిందే. ఇక్కడ భాజపా కేవలం 15 సీట్లు మాత్రమే దక్కించుకోగలిగింది. రాజస్థాన్‌లో 99 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించగా.. భాజపా 73 సీట్లకే పరిమితమైంది. మధ్యప్రదేశ్‌లో రెండు పార్టీల మధ్య హోరాహోరీగా సాగిన పోరులో కాంగ్రెస్ 114 సీట్లను భాజపా 109 సీట్లను దక్కించుకున్నాయి.

# క్యాన్సర్ పేరుతో కుటుంబాన్నే మోసం చేసింది

## రూ.2 కోట్లు దోచుకున్న ఎన్నారై యువతి

యూకే: డబ్బుపై ఉన్న వ్యామోహం మనిషి చేత ఎంత పనైనా చేయిస్తుందని చెప్పడానికి ఈ ఘటనే నిదర్శనం. బ్రెయిన్ క్యాన్సర్ పేరుతో ఓ యువతి సొంత కుటుంబాన్నే మోసం చేసింది. క్యాన్సర్ ఉందని చికిత్స చేయించుకోవాలంటూ ఒకటి కాదు రెండు కాదు 2,50,000 పౌండ్లు దోచుకుంది. అంటే మన కరెన్సీలో దాదాపు రూ.2 కోట్ల పైమాటే. భారత్‌కు చెందిన జాస్మిన్ మిస్త్రీ అనే యువతి తన భర్త విజయ్‌తో కలిసి యూకేలో ఉంటోంది. అప్పటికే జాస్మిన్‌కు మరో వ్యక్తితో వివాహమై విడిపోయింది.ఈ నేపథ్యంలో 2013లో విజయ్‌కు ఓ నెంబర్ నుంచి వాట్సాప్‌నకు మెసేజ్ వచ్చింది. అందులో జాస్మిన్‌కు బ్రెయిన్ క్యాన్సర్ ఉందని, చికిత్సకు డబ్బు కావాలని రాసుంది. ఆ మెసేజ్ చేసింది జాస్మిన్‌కు చికిత్స అందిస్తున్న వైద్యుడేమో అనుకుని విజయ్ అడిగినంత డబ్బు ఇస్తూ వచ్చాడు. అంతటితో ఆగకుండా 2014లో జాస్మిన్ మరో సిమ్ నుంచి తన మాజీ భర్తకు మెసేజ్ చేసింది. తనకు క్యాన్సర్ వ్యాధి ముదిరిందని, మెరుగైన చికిత్స నిమిత్తం అమెరికాకు వెళ్లాలని 50,000 పౌండ్లు ఖర్చవుతుందని పేర్కొంది. తన బ్రెయిన్ స్కానింగ్ ఫొటోను కూడా పంపించింది. మాజీ భార్యే అయినప్పటికీ అతను సాయం చేయడానికి వెనుకాడలేదు. కానీ జాస్మిన్ మోసం గతేడాది బయటపడింది. జాస్మిన్ అనారోగ్య పరిస్థితి గురించి ఆమె మాజీ భర్త వైద్యురాలైన తన స్నేహితురాలికి చెప్పాడు. జాస్మిన్ తనకు పంపిన ఫొటోను స్కానింగ్ ఫొటో కూడా పంపించాడు. అయితే ఆ బ్రెయిన్ స్కాన్ ఫొటోను గూగుల్‌లో చూశానని సదరు వైద్యురాలు చెప్పడంతో అతను కంగుతిన్నాడు. వెంటనే జాస్మిన్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టగా సిమ్ కార్డులు మారుస్తూ కుటుంబీకులకు, స్నేహితులకు క్యాన్సర్ పేరు చెప్పి దాదాపు రూ.2 కోట్ల వరకు డబ్బు దోచుకున్నట్లు తేలింది.

# నిజాయితీతో పనిచేయడంవల్లే ఆ సంస్థ ఈ స్థాయికి వచ్చింది : కే.విశ్వనాథ్



విశాఖపట్నం : సినీ దర్శకుడు, కళాతపస్వీ కే.విశ్వనాథ్ విశాఖలో రామ్‌రాజ్ కాటన్ షోరూమ్‌ను ప్రారంభించారు. రామ్‌రాజ్ కాటన్ యాజమాన్యానికి దక్షిణ భారతం దేశంలో ఇది 125వ షోరూం. నిజాయితీ, క్రమశిక్షణతో పనిచేయడంవల్లే రామ్‌రాజ్ కాటన్ యాజమాన్యం ఈ స్థాయికి వచ్చిందని విశ్వనాథ్ అన్నారు. ప్రసాదం అంటే తిరుపతి లడ్డూ గుర్తుకు వస్తుందని, అలాగే కాటన్ అంటే రామ్‌రాజ్ కాటన్ గుర్తుకు వస్తుందని విశ్వనాథ్ అన్నారు. షోరూమ్‌ల నిర్వహణల ద్వారా 30వేల మంది చేనేత కార్మికులకు ఉపాధి కల్పించడమే కాకుండా భారతీయ సంప్రదాయన్ని చాటి చెబుతున్నామని రామ్‌రాజ్ కాటన్స్ అధినేత నాగరాజన్ అన్నారు. ఇది కమర్షియల్‌గా చేసే వ్యాపారం కాదని ఆయన అన్నారు.



# పతనమవుతోన్న పసిడి ధర

దిల్లీ: పసిడి ధర తగ్గుదల కొనసాగుతోంది. సోమవారం రూ.190 తగ్గడంతో పది గ్రాముల బంగారం ధర రూ.32వేలకు చేరింది. పెళ్లిళ్ల సీజన్ ముగియనుండటంతో బంగారం ధర తగ్గుతూ వస్తోంది. దీనికి తోడు అంతర్జాతీయంగా బలహీన సంకేతాలు, స్థానిక నగల వర్తకుల తయారీదారుల దగ్గర నుంచి డిమాండ్ లేకపోవడంతో పసిడి ధర పతనమవుతోందని బులియన్ ట్రేడింగ్ వర్గాలు వెల్లడించాయి.అంతర్జాతీయంగానూ బంగారం ధర తగ్గింది. సింగపూర్ మార్కెట్లో బంగారం ధర 0.07శాతం తగ్గడంతో ఔన్సు 1,238.20 డాలర్లు పలికింది. దేశ రాజధాని దిల్లీలో 99.9శాతం పసిడి ధర రూ.32వేలు కాగా, 99.5శాతం పుత్తడి రూ.31,850 పలుకుతోంది. వెండి ధర మాత్రం స్తబ్దుగా ఉంది. కిలో వెండి రూ.38,400గా ఉంది.



పెథాయ్ తుఫాన్‌కు ముందుస్తు జాగ్రత్తలపై రాష్ట్ర మానవవనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర రెడ్డి, తదితర ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల బంద్ విజయవంతం




కొయ్యూరు: మండలంలో గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. మండల కేంద్రంలోని కాకరపాడు కళాశాల, కొయ్యూరు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు స్వచ్ఛంధంగా బంద్‌లో పాల్గన్నారు. ఈ కార్యక్రమంలో మండల కేంద్రం లోని పాఠశాలలోని విద్యార్థులతో పాటు గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.సూరిబాబు, సిఐటియు నాయకులు వై.అప్పలనాయుడు పాల్గన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వెంటనే ఏజెన్సీ డిఎస్సీని తీయాలని, జిఒ నెంబు 132ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆనంద్, సుమన్, దొరబాబు పాల్గొన్నారు.

# మతబంధత లేని మకరందపు ఊట భగవద్గీత



భగవద్గీత.. హిందూ సంస్కృతీ, ఆర్ష సంప్రదాయాల ఊట. వ్యక్తిత్వ వికాసం అందించే ఓ మహనీయుని మాట. భక్తిని, ముక్తిని, మోక్షాన్ని, సాధకునకు అందించే గొప్ప సాధనా పరికరం. జీవ తత్వాన్ని, జీవన తత్వాన్ని, జీవిత తత్వాన్ని అందించు పవిత్ర గోపురం, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందింప చేసే ఉద్గ్రంథం. భవరోగ పీడితుల పాలిట ఔషధం. అహం, మోహం, మమకారాలను దునుమాడే అగ్ని కణం. ఆత్మ విశ్వాసాన్ని, ఆత్మ సౌందర్యాన్ని, ఆత్మ గౌరవాన్ని పరిపుష్టం చేసే మహా భాష్యం. బంధాలను బంధనాలను తగ్గించే మహోధృత తరంగాల వాడి. మానవాళికి జీవనాఢి. జీవన విధానాన్ని, పధాన్ని, విధానాన్ని నిర్దేశించి, జీవిత మొత్తాన్నే మార్చివేసే దివ్య యంత్రం. మన తలరాతను మార్చే మహా మంత్రం. దివ్య తరంగాల ధృతి. వేదమంత్రాల మోత. భవబంధాల కోత. అర్జునుని సకల జీవుల సంకేతంగా భావించి, జీవన సందేహాలను నివృత్తి చేసేందుకు దేవదేవుడు శ్రీకృష్ణుడు అర్జునునికి చెప్పిన ఆధ్యాత్మిక రహస్యం. మహత్తుని, మహత్యాన్ని అందించే మహామహా మంత్రాల కలపోత భగవద్గీత. బోధనల ఊట. పారమార్థికాల సొబగులు అందించే ఆధ్యాత్మిక తోట. ఉపనిషత్తుల పూబాట. భవితను బంగారం చేసే ఘనత. భవితకు పట్టం కట్టి ఘనతను నిలబెట్టే సాధనా సంపత్తుల ఊత. జీవిత యుద్ధాన జయాలు అపజయాలు తప్ప వని, అన్నిటినీ ఓర్పు, నేర్పుతో ఎదుర్కొన వలసిందే, అనే జీవిత పాఠాన్ని చెప్పే మహా భాష్యం. ప్రజ్ఞతను నేర్పించి, దివ్యత నవ్యత రమ్యత సమకూర్చే ఉపదేశ సారం. ఆ దేవదేవుడు మానవాళికి ఇచ్చిన అభయం. మానవ జీవితాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకు వెళ్ళే మహోన్నత త్రోవ. దివ్యత్వం అంచులకు తీసుకుని వెళ్లే మహిమాన్విత దోవ. పరమాత్మ కోసం జీవాత్మ చేయాల్సిన సేవ. పారమార్థిక అంతరంగం. పరమార్థాన్ని, పర అర్థాన్ని బోధించే అమరత్వం. సమగ్ర జీవిత విశేషాలు విశిష్టతలు అందించే వరిష్ఠ గ్రంథం. హితాన్ని పంచే, పరహితాన్ని పెంచే మతబంధత లేని మకరందపు ఊట భగవద్గీత.

వేద మంత్రాల మోత భగవద్గీత. అందుకే భగవద్గీత, గీతామాత అయ్యింది. పూజ్యనీయురాలు అయింది. పూజలు అందుకుంటోంది. అందుకుంటూనే ఉంటుంది. గీతను అనుభవిద్దాం. అనుభవం లోనికి తెచ్చుకుందాం.

# 20 ఎకరాల్లో నేలబారిన చెరకు తోట



రోలుగుంట : విశాఖపట్నం జిల్లా రోలుగుంట మండలం జగ్గంపేట పంచాయతీ నాయుడు పాలెం గ్రామంలో సుమారు 20 ఎకరాల చెరుకు తోట నేల బారినపడింది. దీంతో రైతులు చాలా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ తుఫాను కారణంగా చేతికందిన పంట నాశనం అయిపోయిందని రైతులు చాలా బాధపడుతున్నారు.

తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుకుంటున్నారు. గాలి తీవ్రత అధికమవడం వల్ల తమ పంట పోయిందని రైతులందరూ కూడా చాలా బాధపడుతున్నారు.

# సైన్సుఫేర్‌లో అదరగొట్టిన ప్రతిభ హైస్కూల్ విద్యార్థులు



మల్కాపురం : విద్యార్థలకు సైన్సుపై అవగాహన కల్పించడం ద్వారా వారి భవిష్యత్తును బంగారుమయం చేయవచ్చునని మునగాడ తహశీల్దార్ ఎస్.రాజారావు అన్నారు. జి.వి.ఎం.సి 47వ వార్డు పరిధి ములగాడ హౌసింగ్ కాలనీలో ఉన్న ప్రతిభ హైస్కూల్‌లో పాఠశాల ప్రిన్సిపాల్, వైకాప రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోసంగి వెంకటరమణి ఆధ్వర్యంలో సైన్సు ఫేర్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మునగాడ తహశీల్దార్ ఎస్.రాజా రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు సైన్సు పట్ల అవగాహన తలిగి ఉండటం వల్ల వారు భవిష్యత్తులో శాస్త్రవేత్తలు అయ్యే అవకాశం ఉంటుందని, అలాగే పలు సైన్సు నమూనాలు పట్ల అవగాహన కలిగి ఉంటే మంచి ఉద్యోగాలలో స్థిరపడి దేశ భవిష్యత్తును కాపాడే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల కన్జర్వేషన్ ఆఫ్ వాటర్, ప్లేట్‌సెల్, న్యూరాన్, హార్ట్ ఫైబర్స్, సేఫ్టీరూల్స్, సోలార్ సిస్టమ్స్, తదితర నమూనాలు ఏర్పాటు చేసి వాటిపై అవగాహన కల్పించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఇగ్నో లో 2019 జనవరి ప్రవేశాలు ప్రారంభం

## అడ్మిషన్స్‌కు ఆఖరు తేదీ 15 జనవరి 2019

విశాఖపట్నం: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) జనవరి 2019 గాను మాస్టర్స్, పిజీ డిప్లొమా, డిప్లొమా మరియు సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశాలకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో మరియు యానాం లో నివసించే అభ్యర్థులు విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలో ధరఖాస్తులు చేసుకోవచ్చు. ఇగ్నో ప్రవేశాలన్నీ పూర్తిగా ఆన్‌లైన్ విధానం ద్వారానే జరుగుతాయి. ఇగ్నో వెబ్సైట్‌లో ఇవ్వబడిన అడ్మిషన్ల ఆన్ లైన్ పోర్టల్ ద్వారా ప్రవేశాలకు దరఖాస్తు దానితో పాటు ప్రవేశ ఫీజులు కూడా చెల్లించవలసి ఉంటుంది. ఎం.కాం., ఎం.ఎస్.డబ్ల్యు. మరియు 15 రకాల పీజీ కోర్సులలో, బీ.ఏ, , బి.కాం., బ్యాచిలర్ ఇన్ టూరిజం స్టడీస్, లైబ్రరీ సైన్సు, సోషల్ వర్క్ మరియు బి.ఎస్.సి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్ మరియు లైఫ్ సైన్సెస్ (బోటని మరియు జువాలజీ) మొదలైన డిగ్రీ కోర్సులు ఇంకా మరెన్నో నైపుణ్యాలు పెంచే, ఉద్యోగాధారిత డిప్లొమాలు మరియు సర్టిఫికెట్ కోర్సులకు అర్హత కలిగిన అభ్యర్థులు కింద ఇవ్వబడిన లింక్ క్లిక్ చేసి తమ ప్రవేశానికి ధరఖాస్తు చేసుకోవాలి. https://onlineadmission.ignou.ac.in/admission/ . వీటితో పాటు ఐ.సి.ఏ.ఐ, ఐ.సి.ఎస్.ఐ సంస్థల సహకారంతో ఇగ్నో అందిస్తోన్న ప్రత్యేకమైన బి.కాం. కోర్సులకు కూడా పైన ఇవ్వబడిన అడ్మిషన్ల లింక్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చు. అర్హతలు, ఇతర వివరాలకు ఇగ్నో వెబ్సైట్‌ను గానీ ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని లేదా ఇగ్నో అధ్యయన కేంద్రాలను సంప్రదించవచ్చు.

మేనేజ్మెంట్ స్పెషలైజేషన్ డిప్లమా లకు డిగ్రీ చదివిన అభ్యర్థులు ప్రవేశ పరీక్ష లేకుండా ప్రత్యక్ష ప్రవేశం: ఇగ్నో అందిస్తున్న మేనేజ్మెంట్ పి .జి. డిప్లొమా లైన హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ (PG ²HRM), ఫైనాన్స్ మేనేజ్‌మెంట్(PG ²FM), ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ (PG ²OM), మార్కెటింగ్ మేనేజ్మెంట్ (PG ²MM) and ఫైనాన్స్ మార్కెట్ ప్రాక్టీస్ (PG ²FMP) కోర్సులలో ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా డిగ్రీ చదివిన అభ్యర్థులు ఎవరైనా చేరవచ్చు. అభ్యర్థులు ఇగ్నో వెబ్సైట్ నుండి ఉచిత ప్రాస్పెక్టసు డౌన్లోడ్ చేసి పూర్తి చేసిన దరఖాస్తుల్ని ఇగ్నో ప్రాంతీయ కేంద్రం, విశాఖపట్నంనకు సమర్పించాల్సి ఉంటుంది. వాటితో పాటు ఎం.ఏ (ఎడ్యుకేషన్), ఎం.బి.ఏ (బ్యాంకింగ్ ఫైనాన్స్) కోర్సులకు కూడా ఆఫ్ లైన్ ద్వారా విశాఖపట్నం ప్రాంతీయకేంద్ర కార్యాలయంలో దరఖాస్తుల్ని సమర్పించాలి.

డిగ్రీ (బి.ఏ., బి.కాం., బి.ఎస్.సి.) మరియు బి.పి.పి. (బ్యాచిలర్ ప్రిపరేటరీ ప్రోగ్రామ్) కోర్సులలో చేరగోరే అర్హత కలిగిన ఎస్.సి., ఎస్.టి అభ్యర్థులకు ఫీజు రీయింబర్సుమెంట్ సదుపాయం ఉంది. వీరు ఆన్ లైన్ పద్ధతిలోనే పూర్తి ఫీజు చెల్లించి దరఖాస్తు నింపాల్సి ఉంటుంది. ప్రవేశాలు పూర్తయిన తరువాత చెల్లించిన ఫీజు నేరుగా విద్యార్థి బ్యాంకు అకౌంట్‌లో జమ చేయబడుతుంది. అంతే కాకుండా ట్రాన్సు జెండర్ అభ్యర్థులకు ఇగ్నోఅందించే అన్ని కోర్సులకు పూర్తి రాయితీ ఉంది. ఈ సదుపాయాన్ని విశాఖపట్నం ప్రాంతీయకేంద్రం పరిధిలోని ఉన్న హిజ్రాలు, ట్రాన్సుజెండర్ అభ్యర్థులు ఉపయోగించుకోవాలని ఇగ్నో కోరుతుంది.

మరిన్ని వివరాల కోసం: ఇగ్నో అధ్యయన కేంద్రాలు ఉన్న విశాఖపట్నం, Ph: 0891-2746293, కాకినాడ, Ph: 0884-2358515, రాజమండ్రి, Ph: 0883-2433002, అమలాపురం,: 9441208805, గాజువాక, : 9866661136, విజయనగరం, వీ: 9440999986 రాజాం, వీ: 9491816025, సానిగూడెం, వీ: 9440028276 భీమవరం: 9866624444 , తదితర అధ్యయన కేంద్రాలను గానీ, ఇగ్నో విశాఖపట్నం. ప్రాంతీయ కేంద్రాన్ని ఫోన్: 0891-2511200/300/400 నెంబర్ల ద్వారాగానీ rcvisakhapatanamignou.ac.in ఈమెయిలు ద్వారా గానీ సంప్రదించవచ్చు.

# గెలుపు ఓటమికి మధ్య విహారి, పంత్

## భారత విజయ లక్ష్యం 287



పెర్త్: ఇంకా మూడు సెషన్లు ఉన్నాయి. టీమిండియా విజయానికి కావాల్సింది 175 పరుగులు. మిగిలింది ఐదుగురు ఆటగాళ్లు. హనుమ విహారి, రిషభ్ పంత్‌ను మినహాయిస్తే అంతా బౌలర్లే. వికెట్ పేస్‌కు, బౌన్స్‌కు సహకరిస్తోంది. అటువైపేమో చురకత్తుల్లాంటి బంతులు సంధించే మిచెల్ స్టార్క్, హేజిల్‌వుడ్, కమిన్స్. వీరికి తోడు పిచ్‌పై పగుళ్లను ఉపయోగించుకోగల ప్రధాన స్పిన్నర్ నేథన్ లైయన్. చివరి రోజు అతడు విజృంభిస్తాడనడంలో సందేహమే లేదు! వీటన్నిటినీ అధిగమించి కోహ్లీసేన్ గెలిచేనా? కనీసం డ్రా చేయగలదా? చేయాల్సింది 175 పరుగులే కాబట్టి విజయానికి అవకాశం ఉంది. రెండు వికెట్లు చేజార్చుకుంటే ఓటమి ఖాయం! ఇక డ్రా పరిస్థితే రాదు!

ఈ సారి ఖవాజా వంతు

ఓవర్‌నైట్ స్కోరు 132/4తో నాలుగో రోజు, సోమవారం ఆస్ట్రేలియా ఆట ఆరంభించింది. అప్పటికే జట్టుకు 175 పరుగులు ఆధిక్యం ఉంది. ఈ క్రమంలో ఖవాజా (72; 213 బంతుల్లో 5x4), టిమ్ పైన్ (37; 116 బంతుల్లో 4x4) స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశారు. ఖవాజా అర్ధశతకం అందుకున్నాడు. శతకం వైపు పయనించాడు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 72 పరుగుల విలువైన భాగస్వామ్యం అందించారు. అయితే షమి చెలరేగాడు. 6 పరుగుల వ్యవధిలో వీరిద్దరినీ, ఫించ్‌ను పెవిలియన్ పంపించాడు. ఆ తర్వాత బుమ్రా టెయిలెండర్ల పని పట్టాడు. దీంతో ఆసీస్ 243 పరుగులు చేసింది. కోహ్లీసేనకు 287 పరుగుల భారీ లక్ష్యం నిర్దేశించింది.

దక్కని శుభారంభం

ఛేదనకు దిగిన టీమిండియాకు ఆశించిన శుభారంభం దక్కలేదు. పరుగుల ఖాతా తెరవకముందే తొలి ఓవర్‌లోనే ఓపెనర్ లోకేశ్ రాహుల్ (0) డకౌట్ అయ్యాడు. స్టార్క్ వేసిన బంతిని వదిలేయాలా వద్దా ఆలోచించేలోపు బంతి వికెట్లను పడగొట్టింది. 13 పరుగుల వద్ద నయావాల్ ఛెతేశ్వర్ పుజారా (4; 11 బంతుల్లో 1/4)ను హేజిల్‌వుడ్ ఔట్ చేశాడు. దీంతో భారత్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది. ఈ క్రమంలో విరాట్ కోహ్లీ (17; 40 బంతుల్లో 2/4), మురళీ విజయ్ (20; 67 బంతుల్లో 3/4) కాసేపు నిలిచారు. ఆచితూచి ఆడారు. తేనీటి విరామం తర్వాత స్పిన్నర్ లైయన్ వీరి పనిపట్టాడు. పిచ్‌పై లభిస్తున్న బౌన్స్‌ను సద్వినియోగం చేసుకుంటూ ఫ్లయిటెడ్ డెలివరీలతో ఉక్కిరి బిక్కిరి చేశాడు. జట్టు స్కోరు 48 వద్ద కోహ్లీ, 55 వద్ద విజయ్ వెనుదిరిగారు. హనుమ విహారి (24; 58 బంతుల్లో 4/4) అండగా అజింక్య రహానె (30; 47 బంతుల్లో 2/4, 1/6) నిలిచాడు. ఆసీస్ బౌలర్లను అడ్డుకున్నాడు. అర్ధశతకం దిశగా సాగాడు. అయితే హేజిల్‌వుడ్ వేసిన బంతిని ఆడబోయి హెడ్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో భారత్ విజయంపై ఆశలు సన్నగిల్లాయి. రిషభ్ (9; 19 బంతుల్లో) ఆచితూచి ఆడాడు. ప్రస్తుతం ఆశలన్నీ విహారి, పంత్‌పైనే. ఆట ముగిసే సరికి భారత్ 112/5తో ఉంది. విజయానికి ఇంకా 175 పరుగులు అవసరం. వీరిద్దరూ రెండు సెషన్లు నిలిస్తే విజయం అందించగలరు. లేదంటో ఓటమి ఖాయం. భీకరమైన ఆసీస్ బౌలింగ్ దాడిని అడ్డుకోవడం చాలా కష్టం.

పెథాయ్ తుఫాను ప్రభావంతో ఎటువంటి నష్టాలు వాటిల్లకుండా

# అధికారులందరూ అప్రమత్తంగా వుండాలి

## జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్



విశాఖపట్నం : పెథాయ్ తుఫాను వలన ఎటువంటి నష్టాలు వాటిల్లకుండా ముందస్తు ఏర్పాట్లతో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాల్సిందిగా జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్ నుండి ఎప్పటికప్పుడు టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు సూచనలను జారీ చేస్తున్నారు. తుఫాన్ ప్రభావిత మండలాలు పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం తీర ప్రాంతాలలో బలమైన ఈదురుగాలులు, భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్పించి ఇంట్లోనే ఉండాల్సిందిగా సూచనలను జారీ చేశారు. చెట్లు, విద్యుత్ స్తంభాలులాంటివి పడిన వెంటనే క్లియర్ చేయాల్సిందిగా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

అదేవిధంగా తుఫాన్ పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలించి వారికి తాగునీరు, భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ముందు జాగ్రత్తగా కావల్సిన మందులను అందుబాటులో ఉంచాల్సిందిగా వైద్యాధికారులను ఆదేశించారు. ఈదురుగాలులు, కుండపోతగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తగా విశాఖ రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లను, అనకాపల్లి బస్‌స్టాండ్‌లో పాయకరావుపేట, తుని రూట్‌లోనే వెళ్లే బస్సులను నిలిపివేయడం జరిగిందన్నారు.

కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖరరెడ్డి మండల అధికారులు, ప్రత్యేకాధికారులతో తుఫాను పరిస్థితి, ఆయా మండలాలల ఆస్తుల నష్టాలు, చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలడం వంటి అంశాలపై చేపట్టనున్న చర్యలపై ఎప్పటికప్పుడు టెలికాన్ఫరెన్స్ ద్వారా సూచనలను జారీ చేస్తున్నారు. అదేవిధంగా కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రత్యేక సిబ్బంది ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులను తెలుసుకొనడం జరుగుతుందన్నారు. కలెక్టర్ కార్యాలయంలో తుఫాన్ పరిస్థితులు గురించి తెలుసుకునేందుకు మరియు అత్యవసర పరిస్థితులలో కంప్లేట్ చేసేందుకు కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నెం.1800 4250 0002 అందుబాటులో వుంటుందన్నారు.



బొగ్గు గనిలో గ్యాస్ లీక్..

# ముగ్గురు కార్మికులు మృతి

కోర్బా: బొగ్గు గనుల్లో గ్యాస్ లీకై ముగ్గురు కార్మికులు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా జిల్లాలో ఆగ్నేయ బొగ్గు గనుల్లో ఆదివారం ఈ ఘటన జరిగిందని స్థానిక పోలీసులు తెలిపారు.

వివరాల్లోకి వెళ్లితే.. బంకిమొంగ్ర ఆధ్వర్యంలోని బగ్దేవా బొగ్గు గనుల్లో సాయంత్రం వేళ ఈ దుర్ఘటన జరిగింది. నిర్మాణంలో ఉన్న ఓ టన్నెల్‌లోకి ఓ కార్మికుడు ప్రవేశించాడు. అయితే అక్కడ ఆక్సీజన్ తక్కువగా ఉండడంతో ఊపిరి పీల్చుకోవాడినికి ఇబ్బంది పడ్డాడు. అతడికి సహాయం చేయడానికి మరో ఇద్దరు కార్మికులు అందులోకి ప్రవేశించారు. ఈ క్రమంలో ప్రాణంతకరమైన గ్యాస్ విడుదలైంది. ప్రాణ వాయువు అందక, సకాలంలో ఆ టన్నెల్ నుంచి బయటికి రాలేక మృత్యువాత పడ్డారు.

కాగా ఈ విషయమై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి భూపేశ్ బఘల్.. బాధిత కుటుంబాలకు రూ.75,000 పరిహారాన్ని ప్రకటించారు.

# ముగిసిన దుర్గగుడి పాలకమండలి సమావేశం

## దసరా మెమోంటాల స్కాంలో అవకతవకలు జరిగిన మాట వాస్తవమే

విజయవాడ: దుర్గగుడి పాలక మండలి సమావేశం ముగిసింది. భవానీ దీక్షా విరమణ ఏర్పాట్లపై పాలక మండలి సభ్యులు పలు నిర్ణయాలు తీసుకుంది. జనవరి 1 నుంచి డ్రస్ కోడ్ అమలుకు ఆమోదం తెలిపింది. సుప్రభాత సేవను నిత్య ఆర్జిత సేవగా నిర్వహించేందుకు 300 టిక్కెట్ ధర ఒక్కొక్కరికి నిర్ణయిస్తూ ఆమోదం తెలిపింది. దసరా మెమోంటాల స్కాంలో అవకతవకలు జరిగిన మాట వాస్తవమేనని, పోలీసుల విచారణలో కూడా అంగీకరించారని దుర్గగుడి ఈవో కోటేశ్వరమ్మ తెలిపింది. చైర్మన్ సిఫార్సు మేరకు ఉద్యోగుల సస్పెన్షన్‌ను ఎత్తివేశామని, ఇంకా విచారణ కొనసాగుతుందని కోటేశ్వరమ్మ చెప్పారు.

# వైభవంగా రామయ్య తెప్పోత్సవం



భద్రాచలం: ముక్కోటి ఏకాదశి వేడుకల్లో ప్రధాన ఘట్టమైన తెప్పోత్సవం భద్రాచలంలో వైభవోపేతంగా జరిగింది. సీతారామచంద్రస్వామి వార్లు గోదావరి నదిలో హంసవాహనంపై విహరించారు. ఈ తెప్పోత్సవానికి అధికారులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం సీతారామ స్వామివార్లను భక్తుల జయజయ ధ్వానాల మధ్య దివ్యక్షేత్రం నుంచి గోదావరి నది ఒడ్డుకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నాలుగు రోజుల నుంచి సిద్ధం చేసిన హంస వాహనంపై విహరింపజేశారు. భక్త రామదాసు కాలం నుంచి భద్రాద్రి దివ్యక్షేత్రంలో ఈ తెప్పోత్సవ కార్యక్రమం ఆనవాయితీగా వస్తోంది.

అయితే, ఈసారి వేడుకలపై వర్షాలు తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో భక్తుల సందడి తగ్గింది. రాత్రి నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం పడటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు.

మొత్తం 20 రోజుల పాటు సాగే అధ్యయనోత్సవంలో భాగంగా జరిగే ఘట్టాల్లో తెప్పోత్సవం, వైకుంఠ ఉత్తర ద్వార దర్శనం కీలకమైనవి. రేపు ఉదయం మిథిలా మైదానంలో ఉత్తర ద్వార దర్శనం జరగనుంది. ఈ వేడుకకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు.

తిరుమలలో వైకుంఠ ఏకాదశికి

# విస్తృత ఏర్పాట్లు



తిరుమల: వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాల కోసం తితిదే అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు వేచి ఉండేందుకు తాత్కాలిక షెడ్లు నిర్మించారు. 4 నుంచి 5 కిలోమీటర్ల క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఏకాదశి దర్శనం కోసం ఈ ఉదయం 10 గంటల నుంచే భక్తులను క్యూలైన్లల్లోకి అనుమతిస్తున్నారు.

తిరుమలేశుడిని దర్శించుకోవాలని నిత్యం వేలాది భక్తులు పరితపిస్తూ ఉంటారు. అత్యంత పవిత్రమైన ఏకాదశి రోజున శ్రీవారిని దర్శించుకుని వైకుంఠ ద్వార ప్రవేశం చేస్తే శుభం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఇందుకోసం ఇప్పటికే తిరుమలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో 1.70లక్షల మందికి స్వామివారి దర్శనం కల్పించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. వైకుంఠం 1, 2 క్యూ కాంప్లెక్స్‌లకు అనుసంధానంగా నారాయణగిరి ఉద్యానవనంలో 16 భారీ షెడ్లను నిర్మించారు. 20 వేల మంది భక్తులు కూర్చొనే విధంగా ఇక్కడ ఏర్పాట్లు చేశారు. ఇదే తరహాలో మరో 40వేల మంది భక్తులు వేచి ఉండేలా తిరుమాడ వీధుల్లో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేశారు. షెడ్లలో వేచి ఉన్న భక్తులకు తితిదే అధికారులే భోజనం, అల్పాహారం అందించనున్నారు.

బాట గంగమ్మ ఆలయం రింగ్‌రోడ్డు మీదుగా కల్యాణవేదిక వరకు కిలోమీటర్ల మేర రెండు వరుసలతో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఈ అర్ధరాత్రి తర్వాత అర్చకులు ఆలయ ద్వారాలు తెరిచి శ్రీవారికి ధనుర్మాస పూజలు, ఇతర కైంకర్యాలు నిర్వహిస్తారు. అనంతరం వైకుంఠ ద్వారం తెరుస్తారు. మొదటగా ఏకాదశి పాసులు పొందిన వారికి ఈ ద్వారం గుండా అనుమతిస్తారు. ఉదయం 9 గంటల నుంచి సర్వదర్శనం ద్వారా సాధారణ భక్తులకు శ్రీవారి దర్శనం కల్పిస్తారు. ఈ రెండు రోజుల్లో 40 గంటల సమయం సాధారణ భక్తులకే కేటాయించాలని తితిదే అధికారులు నిర్ణయించారు. ఏకాదశి ఉదయం స్వామివారి స్వర్ణ రథోత్సవం, ద్వాదశి నాడు చక్రస్నానం నిర్వహిస్తారు.

# కాంగ్రెస్ నేత సజ్జన్ దోషే

## సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసు.. జీవిత ఖైదు విధించిన న్యాయస్థానం



దిల్లీ: సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత సజ్జన్ కుమార్‌కు దిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో సజ్జన్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు పక్కన బెట్టింది. సజ్జన్‌ను దోషిగా తేలుస్తూ యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. డిసెంబరు 31లోగా ఆయన పోలీసులకు లొంగిపోవాలని న్యాయస్థానం ఆదేశించింది.

1984 అక్టోబరు 31న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీని సిక్కులైన ఆమె వ్యక్తిగత భద్రతాసిబ్బంది కాల్చి చంపిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజే దేశవ్యాప్తంగా సిక్కుల ఊచకోత జరిగింది. ఈ ఘటనకు సంబంధించి అప్పట్లో పలు కేసులు నమోదయ్యాయి. కాగా.. అల్లర్లలో భాగంగా దిల్లీలోని కంటోన్మెంట్ ప్రాంతంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురిని దారుణంగా హత్య చేశారు. ఈ ఘటనలో సజ్జన్‌తో పాటు అప్పటి కాంగ్రెస్ కౌన్సిలర్ బల్వన్ ఖోఖార్, రిటైర్డ్ నేవీ అధికారి కెప్టెన్ భగ్మల్, గిర్ధారీ లాల్‌పై కేసు నమోదైంది.

దీనిపై విచారణ చేపట్టిన ట్రయల్ కోర్టు బల్వన్, భగ్మల్, గిర్ధారీలను దోషులుగా తేల్చుతూ యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో సజ్జన్‌ను నిర్దోషిగా ప్రకటించింది. అయితే సజ్జన్‌ను నిర్దోషిగా ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ బాధితులు దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. మరోవైపు ఈ కేసులో సీబీఐ కూడా అప్పీల్ చేసింది. వీటిపై విచారించిన హైకోర్టును సజ్జన్‌ను దోషిగా నిర్ధారించింది.

**నేడు సిరిసిల్లలో కేటీఆర్ పర్యటన**

హైదరాబాద్: టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామా రావు మంగళవారం సిరిసిల్లలో పర్యటించనున్నారు. కాగా బుధవారం వరంగల్ ఆర్ట్స్ కాలేజీలో కేటీఆర్ సభ జరగనుంది.

ANNAMALAI UNIVERSITY
Directorate of Distance Education
COURSES OFFERED
B.A., B.Com, BBA, BCA, B.Sc, M.A., M.Com, M.Sc, B.Lisc, M.Lisc, PG - MBA, MCA, Diploma, PG.Diploma, Computer Science and IT Courses, Industrial Safety, Lateral entry programs
UG & PG Discontinue Students
Direct Eligible Final Year
9603485698, 6281490615

LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans, Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750




తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన చలి తీవ్రత..

# 9 మంది మృతి

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత పెరిగింది. చలిగాలుల తీవ్రతకు 9 మంది మృత్యువాత పడ్డారు. ఏపీలో 8 మంది, తెలంగాణ ఒకరు మృతి చెందారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం పెదమైనవానిలంకలో వృద్ధురాలు మృతి చెందింది. మొగల్తూరు మండలం కొత్తకాయలతిప్పలో వృద్ధురాలు కృష్ణమ్మ మృత్యువాత పడింది. ప్రకాశం జిల్లా చీరాల ఐక్య నగర్‌లో చలిగాలులకు ఇద్దరు వృద్ధులు మృతి చెందారు. మృతులను వెంకయ్య (73), నూనె కుమారి (61)గా గుర్తించారు. ప్రకాశం జిల్లా వేటపాలెం బస్ షెల్టర్‌లో చలిగాలులకు వృద్ధుడు, విశాఖ జిల్లా హుకుంపేట మండలం దాలిగుమ్మడిలో చలిగాలులకు ఒక వ్యక్తి మృతి చెందారు. తూర్పుగోదావరి జిల్లా కాజులూరు మండలం పల్లిపాలెంలో వృద్ధురాలు మృతి చెందింది. ఉప్పలగుప్తం మండలం భీమనపల్లిలో రంగయ్య (70) మృతి మృతి చెందాడు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కొమ్ముగూడెంలో కాశీ (55) మృతి చెందాడు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com